ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 23 అక్టోబరు 2025



రైల్వేకోడూరు-రెడ్డివారిపల్లె తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయిన దృశ్యం

కోడూరును ముంచెత్తిన వాన

● అత్యధికంగా 178.4 మి.మీ. వర్షపాతం

రైల్వేకోడూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షం వీడలేదు. బుధవారం రైల్వేకోడూరు నియోజకవర్గంలో భారీ వర్షం కురిసింది. దీంతో గుంజన నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నదీ తీర ప్రాంతాల ప్రజలు భయాందోళన లో ఉన్నారు. నదీ తీర ప్రాంతాలలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. నదుల వద్ద పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి రైల్వేకోడూరు సీఐ హేమసుందర రావు, ఎస్‌ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డిలు నదుల వద్దకు ఎవరినీ రానివ్వకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. రైల్వేకోడూరు మండలం మాధవరంపోడు గ్రామానికి చెందిన రాములమ్మ అనే పేద మహిళ ఇంటి గోడ భారీ వర్షం తాకిడికి కూలిపోయింది. పొట్టిరాజుగారిపల్లె-గంగురాజుపోడు గ్రామాల మధ్య ఉన్న తాత్కాలిక రోడ్డు భారీ వరద నీటి ప్రవాహనికి కొట్టుకునిపోయి రాకపోకలు బంద్ అయ్యాయి. రెడ్డివారిపల్లె-కోడూరు మధ్య ఉన్న తాత్కాలిక రోడ్డు కొట్టుకునిపోయింది. ప్రస్తుతం రెడ్డివారిపల్లె పంచాయతీ ప్రజలు పాటిమీదపాళెం మీదుగా చిట్వేలి రోడ్డులోకి వచ్చి రైల్వేకోడూరుకు వస్తున్నారు. మండలంలోని శెట్టిగుంట చెరువుకు వరద నీరు చేరింది. వర్షాలు ఇంకా మూడు రోజుల పాటు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. నదీ తీర ప్రాంతాలలో నివశించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. జిల్లాలోనే అత్యధికంగా రైల్వేకోడూరులో 178.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.




రైల్వేకోడూరు మండలం సూరపురాజుపల్లె బ్రిడ్జి వద్ద ప్రవహిస్తున్న నీరు

రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట చెరువుకు చేరిన వరద నీరు



రైల్వేకోడూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న గుంజన నది



జిల్లాలో భారీ వర్షం

● కోడూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న గుంజన నది ● పొట్టిరాజుగారిపల్లె-గంగురాజుపోడు గ్రామాలకు రాకపోకలు బంద్ ● కొట్టుకుపోయిన రెడ్డివారిపల్లె తాత్కాలిక రోడ్డు
● శెట్టిగుంట చెరువుకు చేరిన వరద నీరు ● వరి పంటకు నష్టం ● అప్రమత్తమైన జిల్లా అధికారులు

అప్రమత్తంగా ఉండండి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి (నేతాజీసర్కిల్), అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రయాణాలు చేయాలని, ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. బుధవారం సాయంత్రం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి హోం మంత్రి అనిత అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి జేసీ హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంశాఖ మంత్రి మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీసు, అగ్నిమాపక శాఖ తదితర బలగాలు సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జేసీ జిల్లా రహదారులు, భవనాల శాఖ, వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, విద్యాశాఖ, విద్యుత్‌శాఖ, అగ్నిమాపక విపత్తుల నిర్వహణ శాఖ తదితర శాఖల అధికారులకు భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. జిల్లాలో వాగులు, వంకల దగ్గర ఉన్న రహదారులపై ప్రత్యేక దృష్టి సారించాలని రహదారులు, భవనాలశాఖ అధికారిని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తగిన సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. సహాయక చర్యలకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను (08561-293006) సంప్రదించవచ్చని ప్రజలకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటిటౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా జిల్లాలో కొన్ని చోట్ల భారీగా, మరికొన్ని చోట్ల ఓ మోస్తరుగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువుల్లోకి వర్షం నీరు చేరుతోంది. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. గాలివీడులో 41.6, చిన్నమండెం 24.8, సంబేపల్లె 29.2, సుండుపల్లె 36.8, రాయచోటి 47.6, లక్కిరెడ్డిపల్లె 49.4, రామాపురం 38.8, వీరబల్లి 33.8, నందలూరు 41.0, పెనగలూరు 32.2, చిట్వేలి 77.8, రాజంపేట 45.8, ఒంటిమిట్ట 17.4 సిద్దవటంలో 15.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. పుల్లంపేటలో 35.4, ఓబులవారిపల్లెలో 90.6, కోడూరు 178.4, ములకలచెరువు 18.6, తంబళ్లపల్లె 18.0, పెద్దమండెం 12.4, గుర్రంకొండ 32.6, కలకడ 42.4, కేవీపల్లె 52.6, పీలేరు 48.2, కలికిరి 37.6, వాల్మీకిపురం 20.2, కురబలకోట 10.2, పెద్దతిప్పసముద్రం 10.4, బి.కొత్తకోట 20.6, రామసముద్రం 14.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

నేడు కూడా పాఠశాలలకు సెలవు..

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం కూడా అన్నమయ్య జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈవో సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఆయా మండలాల ఎంఈవోలు ఈ సమాచారాన్ని అన్ని పాఠశాలలకు చేరవేయాలన్నారు.

పాఠశాలలకు సెలవు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారులు బుధవారం పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. వర్షాన్ని దృష్టిలో పెట్టుకొని వర్షాలు పెరిగితే మరో రెండు రోజుల పాటు సెలవులు కొనసాగే అవకాశాలున్నాయి.



రైల్వేకోడూరు మండలం పొట్టిరాజుగారిపల్లె-గంగురాజుపోడు గ్రామాల తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోయిన దృశ్యం

24 హెక్టార్లలో వరి పంటకు నష్టం



నందలూరు మండలం పాటూరులో దెబ్బతిన్న వరి పంట

జిల్లా పరిధిలోని నందలూరు, రాజంపేట మండలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న 24 హెక్టార్లలో వరి పంట వర్షానికి దెబ్బతినడంతో రూ.33 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. ఇందులో నందలూరు మండలంలోని పాటూరులో 10 మంది రైతులకు సంబంధించిన 8హెక్టార్లలో వరి పంట దెబ్బతినడంతో రూ.11లక్షల ఆస్తి నష్టం జరిగింది. రాజంపేట మండలంలోని అప్పరాజుపేట, తాళ్లపాక గ్రామాల్లో 13 మంది రైతులకు సంబంధించిన 16 హెక్టార్లలో వరి పంట పూర్తిగా దెబ్బతినడంతో రూ.22 లక్షలకుపైగా నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. వర్షం ఇలాగే కొనసాగితే నందలూరు, రాజంపేట మండలాల్లో రైతులు సాగు చేసి కోతకు సిద్ధంగా ఉన్న 528 హెక్టార్లలోని వరి పంటకు చాలా వరకు నష్టం జరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



భోగంపల్లె రిజర్వాయర్‌లో పెరిగిన నీటిమట్టం

చెరువులకు జలకళ

● భోగంపల్లె రిజర్వాయర్‌కు చేరుతున్న నీరు

వాల్మీకిపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో మండలంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. మూగలమర్రి, జమ్మళ్లపల్లె, విఠలం గ్రామాల చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. చింతపర్తి గుంటిగంగమ్మ ఆలయం వద్ద బాహుదా నది ప్రవాహం సాగుతోంది. వర్షంతో పలుచోట్ల వరి, బంతి, చామంతి, టమోటా తదితర పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. వాల్మీకిపురం పట్టణ సమీపంలోని భోగంపల్లె రిజర్వాయర్ ప్రాంతం గత రెండు నెలల క్రితం వరకు బోసిపోయిన ఎడారిని తలపించింది. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రిజర్వాయర్ ప్రాంతం నిండుకుండలా మారింది. రిజర్వాయర్‌లోకి భారీగా నీరు వచ్చి చేరుతున్నప్పటికీ నీరు నిలువ ఉండకపోగా మొరవ ప్రాంతంలోని ఓ భాగం దెబ్బతిని నీటి నిలువ ఉండకపోగా వృథాగా పోతోంది.



వాల్మీకిపురం మండలంలోని జమ్మళ్లపల్లె చెరువులో మునిగిపోయిన ఆలయం

మన్నూరు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ ధీరజ్.. చిత్రంలో ఏఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే



ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

● ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాజంపేట/చిట్వేలి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పోలీసుస్టేషన్లకు వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి పోలీసు వ్యవస్థపై విశ్వాసం పెంపొందించేటట్లు ప్రవర్తించాలని ఎస్పీ దీరజ్ కునుబిల్లి తెలిపారు. బుధవారం మన్నూరు పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీసుస్టేషన్ పనితీరుపై ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డేతో చర్చించారు. సీఐ నాగార్జున, ఎస్‌ఐ వెంకటేశ్వర్లుకు తగు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరం పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రధానంగా సిబ్బంది క్రమశిక్షణ, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు.

కేసుల్లో పురోగతి తప్పనిసరి

పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించడం, కేసుల పురోగతిలో వేగంగా పనిచేయడం తప్పనిసరి అని ఎస్పీ దీరజ్ కునుబిల్లి అన్నారు. బుధవారం చిట్వేలి పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ భవనం పాతది కావడంతో మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనుంపల్లె చెక్‌పోస్టు సరిహద్దులో ఉన్నందున నిరంతరం నిఘా ఉంచాలని అక్రమ కార్యకలాపాలను అరికట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే, ఎస్‌ఐ నవీన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం

గుర్రంకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాన్ని బుధవారం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున టీటీడీ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సహా స్వామివారి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ములకలచెరువు నకిలీ మద్యంలో

వైసీపీ వాళ్లే సూత్రధారులు

● 2023 నుంచే నకిలీ మద్యం తయారీ ● తంబళ్లపల్లె టీడీపీ కీలక నేత వైసీపీ మనిషే
● పథకం ప్రకారమే ఎన్నికల్లో టికెట్
● సోషల్ మీడియాలో ఓ మహిళ వాయిస్ హల్‌చల్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రంలో హాట్‌టాపిక్‌గా మారిన నకిలీ మద్యం తయారీ వెనుక సూత్రధారులు వైసీపీ నాయకులే. ఈ తతంగం ఇప్పటిది కాదు.. వైసీపీ అధికారంలో ఉన్న 2023 నుంచే ఉంది. అయితే ఈ నకిలీ మద్యాన్ని ఇక్కడ తయారు చేయకుండా కర్ణాటకలో తయారు చేసి మన రాష్ట్రానికి యథేచ్ఛగా తరలించి అమ్ముకుని కోట్ల రూపాయలు సంపాదించారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తూ ఉండడంతో భవిష్యత్తులో తమ వ్యాపారానికి ఎటువంటి ఇబ్బందులు ఉండకుండా ఉండేందుకు తమ బిజినెస్ పార్టనర్‌ను ఓ పథకం ప్రకారం తెలుగుదేశం పార్టీలో చేర్పించి టికెట్టు దక్కించుకున్నారు. ఓడిపోయినా తమ వ్యాపారానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా చేసుకుంటూ బాగా సంపాదించారు. ప్రస్తుతం ఈ వివరాలతో ఓ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆడియోలో మాట్లాడిన మహిళ ఎవరైందీ స్పష్టంగా తెలియరాలేదు. ఆడియోలో ఉన్న దాని ప్రకారం తంబళ్లపల్లె మండలానికి చెందిన ఇద్దరు సోదరులు వైసీపీలో క్రియాశీలకంగా ఉంటూ బెంగళూరు కేంద్రంగా అనేక వ్యాపారాలు చేస్తున్నారు. ఆడియోలో మాట్లాడిన మహిళ భర్త కొవిడ్ సెకండ్ వేవ్‌లో చనిపోయారు. తర్వాత ఆమె తంబళ్లపల్లె మండలానికి చెందిన సోదరుల్లో ఒకరితో రెండున్నర సంవత్సరాల పాటు సహజీవనం సాగించింది. ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలు నడిచాయి. తర్వాత ఏమైందో? ఏమో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తి పోలీసుస్టేషన్ వరకు వెళ్లాయి. అతని మీద బెంగళూరు యలహంక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తంబళ్లపల్లె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వస్తే అప్పట్లో అక్కడ ఉన్న ఎస్‌ఐ ఫిర్యాదు తీసుకోలేదు. అసలు ఈ ఆడియో ఎలా బయటకు వచ్చిందని ఆరా తీస్తే ఎవరో కొందరు వ్యక్తులు ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ పెద్ద స్థాయి అధికారులమంటూ ఆమెతో ఫోన్‌లో మాట్లాడారు. నిజమే అని నమ్మిన ఆమె మాట్లాడిన మాటలను మొత్తం ఫోన్‌లో రికార్డు చేశారు. (ఫోన్‌లో ఆమెతో మాట్లాడిన వ్యక్తి కురబలకోటకు చెందిన ఓ టీడీపీ నాయకుడిగా ప్రచారంలో ఉంది.) గతంలో ఆమెతో సహజీవనం సాగిస్తున్న వ్యక్తి తన సమక్షంలో జరిగిన, ఆమె విన్న పలు విషయాలను మాట్లాడింది. అదే సమయంలో తంబళ్లపల్లె మండలానికి చెందిన వైసీపీ నాయకులు తమ వ్యాపార భాగస్వామిని టీడీపీలోకి పంపించి.. టికెట్టు ఇప్పించారని కూడా పలుమార్లు పేర్కొంది. అందరూ ఇక్కడ ప్రత్యర్థులుగా ప్రజల ముందు నటిస్తూ బెంగళూరులో కలిసి వ్యాపారాలు చేసుకుంటారని ఆమె ఆడియోలో పేర్కొంది. తన పేరు బయట పెట్టకుండా చూడాలని, తనకు ఆ నాయకులతో ప్రమాదముందని వాపోయింది. ఇప్పటికే పలుమార్లు ఆ వైసీపీ నాయకులు తనను చంపేస్తామని బెదిరించారని, తన ఫ్లాట్‌లోకి వచ్చి దాడికి యత్నించారని పేర్కొంది. ఇలా మీతో మాట్లాడిన విషయం బయటపడితే తనను చంపేస్తారని కూడా వాపోయింది. అయినా ఆమెను నమ్మించి ఫోన్‌లో మాట్లాడి అన్ని మాటలూ రికార్డు చేసిన వ్యక్తులు ఆ వాయిస్ రికార్డును పది రోజులుగా పలువురికి వినిపిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. దీంతో ప్రస్తుతం ఆమె తీవ్ర ఇబ్బందుల్లోకి కూరుకుపోయినట్లు సమాచారం. ఈ ఆడియో మంగళవారం తొలుత కొందరు మీడియా ప్రతినిధుల చేతికి అందగా బుధవారం కొన్ని చానళ్లలోనూ ప్రసారం అయింది. దీంతో ప్రస్తుతం ఎక్కడ చూసినా ఇదే ఆడియో విషయమే చర్చ నడుస్తోంది.

ప్లాస్టిక్ పట్టలే ఆవాసాలుగా... 6
అభివృద్ధికి నోచుకోని పీలేరు వారపు సంత



వర్షాకాలంలో పీలేరు వారపు సంతలో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులకు ఈ చిన్నారి ప్రయత్నం అద్దం పడుతోంది. పీలేరులో మంగళవారం కురిసిన వర్షానికి సంత ప్రాంగణం చిత్తడిగా మారింది. తండ్రితో పాటు సంతకు వచ్చిన ఓ కుర్రాడు బురదలో నడవలేక కోడి గుడ్ల అట్టలతో దారి ఏర్పాటు చేసుకుని తండ్రి వద్దకు చేరుకున్నాడు. వర్షాకాలంలో సంతలోని వ్యాపారులు, కొనుగోలుదారులు కొబ్బరి పీచు, పాత పేపర్లు, ప్లాస్టిక్ పేపర్లతో దారులు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది.


ప్లాస్టిక్ పట్టల కింద జరుగుతున్న పీలేరు వారపు సంత


సంతలో చెత్త కుప్పల పక్కనే ఏర్పాటైన దుకాణాలు

ప్లాస్టిక్ పట్టలే.. ఆవాసాలుగా..

- ఆదాయం ఘనం...వసతులు శూన్యం
- అభివృద్ధికి నోచుకోని పీలేరు వారపు సంత
- చినుకు పడితే చిత్తడే..
- నీడ, నీరూ కరువే




పీలేరు సంతలో కోడి గుడ్ల అట్టలతో దారి ఏర్పరచుకుంటూ నడుస్తున్న ఓ బాలుడు

పీలేరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నిలకడగా ఆదాయం అందించే వనరులను అభివృద్ధి చేసుకుని దానిని సుస్థిరం చేసుకునేందుకు వ్యక్తులైనా, సంస్థలైనా చర్యలు తీసుకోవడం సర్వసాధారణం. పీలేరు గ్రామ పంచాయతీ అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యంత ప్రాచీనమైన, అత్యంత ఎక్కువ ఆదాయం తెచ్చిపెట్టే సంతగా పేరొందినా అభివృద్ధికి మాత్రం ఆమడదూరంలో నిలిచిపోయింది పీలేరు వారపు సంత. ఎన్నో పాలకవర్గాలు మారినా పీలేరు వారపు సంత అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. దీంతో సంతకు వచ్చే రైతులు, వ్యాపారులు, వినియోగదారులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, తీవ్ర దుర్గంధాన్ని భరిస్తూ తమ కార్యకలాపాలు సాగించాల్సి వస్తోంది.

సూపర్ మార్కెట్‌లకు తీసిపోని పీలేరు సంత

పీలేరులో ప్రతి మంగళవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో సంత జరుగుతుంది. సంతకు పీలేరుతో పాటు కేవీపల్లె, సదుం, పులిచెర్ల, కలికిరి, సోమల, పుంగనూరు మండలాల నుంచి పెద్దసంఖ్యలో రైతులు, పీలేరుతో పాటు కల్లూరు, పుంగనూరు ప్రాంతాల నుంచి చాలా మంది హోల్‌సేల్ వ్యాపారులు వస్తుంటారు. సూపర్ మార్కెట్లకు ఏమాత్రం తీసిపోని విధంగా నిత్యావసర సరుకులతో పాటు తాజా ఆకుకూరల దగ్గర నుంచి కాయగూరల వరకు సంతలో దొరుకుతాయి. సరుకుల రవాణాతో పాటు ప్రజల రాకపోకలకు కూడా సౌకర్యంగా ఉండడంతో పీలేరు పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులు తమకు వారానికి సరిపడా సరుకులు, కూరగాయలు పీలేరు సంత నుంచి తీసుకెళుతుంటారు. దీంతో గడిచిన దశాబ్దకాలంగా వారపు సంత వేలం పాట గణనీయంగా పెరిగింది.

దుర్గంధభరితంగా సంత ప్రాంగణం

సంత తరువాత మిగిలే వ్యర్థాలను శుభ్రపరచకపోవడంతో ఆ ప్రాంగణమంతా దుర్గంధభరితంగా మారుతోంది. దానికి తోడు సంత పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను సంతలోనే పారవేస్తుండడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. చెత్తాచెదారాల నడుమే రైతులు తమ కూరగాయలు విక్రయానికి పెట్టడం, విధి లేక వినియోగదారులు కూడా అక్కడే కొనుగోలు చేయాల్సి వస్తోంది. మందుబాబుల రూపంలో సంతకు మరో సమస్య ఎదురవుతోంది. పగిలిన మద్యం సీసాల కారణంగా చాలామంది గాయాల పాలవుతున్నారు.

అలంకారప్రాయంగా మరుగుదొడ్లు

సంతలోని మరుగుదొడ్లు అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. వాటికి నిరంతర నీటి సరఫరా లేకపోవడంతో అక్కడున్న కాంట్రాక్టరు అందించే అరకొర నీటితోనే ప్రజలు కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సంతకు అధిక సంఖ్యలో వచ్చే మహిళా రైతులు మధ్యాహ్నంగానీ, రాత్రికి గానీ తమ ఇళ్లు చేరుతుంటారు. అంత వరకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వారు ఆరుబయట ప్రదేశాలను ఆశ్రయించక తప్పడం లేదు.

ఆదర్శం.. సదుం పంచాయతీ

సంత అభివృద్ధిలో పీలేరుకు పొరుగున ఉన్న సదుం పంచాయతీ ఆదర్శంగా నిలుస్తోంది. అక్కడున్న సంత ప్రాంగణంలో పక్కా నిర్మాణాలు ఉండడంతో అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. పీలేరు పంచాయతీ అధికారులు, పాలకవర్గం ఇప్పటికైనా సంత అభివృద్ధి గురించి పట్టించుకోవాలని పట్టణ ప్రజలు, వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

సంత వేలం వివరాలు...

2021-22	రూ.10 లక్షలు
2022-23	రూ.10.85 లక్షలు
2023-24	రూ.12.65 లక్షలు
2024-25	రూ.10.47 లక్షలు(ఏడు నెలల కాలానికి)
2025-26	రూ.28.25 లక్షలు

సౌకర్యాలు కల్పిస్తే వ్యాపారాలు పెరుగుతాయి



సంతలో సరైన సౌకర్యాలు లేక మాలాంటి చిన్న వ్యాపారులకు వ్యాపారం అంతంత మాత్రంగానే జరుగుతా ఉంది. మట్టిలో కూర్చోవడమే కాకుండా కూరగాయలను కింద పెట్టుకోవడం వల్ల అవి దుమ్ముకొట్టుకుపోతున్నాయి. దీంతో చాలా మంది వాటిని చూడగానే ముఖం చిట్లిస్తున్నారు. ఇక వర్షం వస్తే మా పరిస్థితి దేవుడెరుగు. కూర్చోవడానికి కూడా వీలుండదు. సంతలో సౌకర్యాలు కల్పిస్తే మాలాంటి వాళ్లు ఇంకో నలుగురు బతుకుతారు.

- రెడ్డి శేఖర, చిరు వ్యాపారి, పీలేరు

ప్లాట్‌ఫాంలు నిర్మించారు.. పైకప్పు మరిచారు

సంత ప్రాంగణంలో సరైన సదుపాయాలు లేకపోవడంతో వ్యాపారులు ప్లాస్టిక్ పట్టల కింద దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అటు వ్యాపారులు, రైతులు, ఇటు వినియోగదారులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ సంత చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో సంత ప్రాంగణంలో కాంక్రీట్ ప్లాట్‌ఫాంలు నిర్మించినా వాటికి పైకప్పు ఏర్పాటు చేయకపోవడంతో వాటి ఉపయోగం కూడా నామమాత్రంగా మిగిలింది. ఇక వర్షాకాలంలో వ్యాపారులు, ప్రజల బాధలు వర్ణనాతీతం. తమ వద్ద ముక్కుపిండి సెస్ వసూలు చేసే కాంట్రాక్టరు, పంచాయతీ పాలకవర్గం తమకు వసతులు కల్పించడంలో మాత్రం శ్రద్ధ చూపడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. సంత ప్రాంగణంలోనే ఓ ఓవర్‌హెడ్ ట్యాంకు, ఆర్వో ప్లాంటు ఉన్నా సంతలో తాగునీటి వసతి మరిచారు. ఎప్పుడైనా విమర్శలు వచ్చినప్పుడు నాలుగు రోజుల పాటు నాలుగు మట్టి కుండల్లో నీరు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు.


సంత సగభాగంలో నిర్మించిన ప్లాట్‌ఫాంలు


వారపు సంతలో బురదతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వ్యాపారులు

శుభ్రత పాటించని కోళ్లఫారాలకు నోటీసులు


కోళ్లఫారాల యజమానులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేశ్

నిమ్మనపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో పరిశుభ్రత పాటించని కోళ్ల ఫారాల యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీవో రమేశ్ తెలిపారు. కోళ్ల ఫారాలతో ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వాటిని తక్షణం మూసివేస్తామన్నారు. బుధవారం రాచవేటివారిపల్లి పంచాయతీలోని గోసిరెడ్డి నాగరాజుకు చెందిన కోళ్ల ఫారాల వలన గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు రావడంతో సిబ్బందితో కలిసి కోళ్లఫారాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ కోళ్ల ఫారాల యజమానులు కోళ్ల వ్యర్థాలను తొలగించకుండా, చనిపోయిన కోళ్లను గ్రామ సమీపంలో పడవేస్తుండడంతో ఈగలు ఎక్కువై ప్రజలు అంటురోగాలు, విషజ్వరాల బారిన పడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో కోళ్ల వ్యర్థాల నుంచి భరించలేని దుర్గంధం వస్తూ ఈగలు ఎక్కువగా పెరిగాయన్నారు. ప్రజారోగ్యంపై దెబ్బతీసే కోళ్లఫారాల యజమానులు తక్షణం ఈగలు రాకుండా స్ప్రే చేయాలన్నారు. ఒకవేళ ఈగలను అరికట్టకపోతే కోళ్లఫారాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం కోళ్ల ఫారాల యజమానికి నోటీసులు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, కార్యదర్శి రజని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


బాహుదా ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బాహుదా ప్రాజెక్టు నిండే అవకాశం ఉందని నది పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ ఏఈఈ శ్రీహరిరెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీవో రమేశ్, స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు నిండేందుకు కేవలం ఐదడుగులు మాత్రమే ఉందని, ప్రజలు నదీ పరివాహక ప్రాంతాల్లో ఉండరాదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

డ్యూటీ రోస్టర్లు మార్చాలి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ జూనియర్ అసిస్టెంట్ల డ్యూటీ రోస్టర్లను ప్రతి మూడు నెలలకు మార్చాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి ముబారక్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో సూపరింటెండెంట్, ఆర్ఎంఓతో ఏఐటీయూసీ నేతలు, జూనియర్ అసిస్టెంట్లతో కలిసి చర్చలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏడాదిన్నరగా డ్యూటీ రోస్టర్లను మార్చకపోవడం, జూనియర్ అసిస్టెంట్లు సాయిప్రతాప్, లోకేశ్వర పాలన విషయంలో అజమాయిషీ చేస్తున్నారని ఆరోపించారు.

ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం కలిగించాలి

- ఆసుపత్రి అభివృద్ధి సంఘు సమావేశంలో మంత్రి మండిపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సంఘ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఓపీ బాగా పెరిగిందని, రోజుకు 1000 మంది వైద్యం పొందడం సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా వసతులు కల్పిస్తామన్నారు. వైద్యుల సలహా మేరకు అవసరమైన పరికరాలను సమకూర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలియజేశారు. క్రిటికల్ కేర్ ప్రారంభోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్లినట్లు తెలియజేశారు. ప్రజల్లో నమ్మకం కలిగేలా వైద్యం అందించి కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని వైద్యులకు సూచించారు. వైద్యం కోసం వచ్చిన వారిపై కొంతమంది వైద్యులు దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు తన దృష్టికి రావడంతో ఎస్పీతో చర్చించి ఇక్కడ ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డు విధుల్లో ఉండేట్లుగా చూస్తానని హామీ ఇచ్చారు. ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కోసం తమ వంతు సహకారం అందిస్తామని తెలియజేశారు. ఆసుపత్రిలో రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో రాయచోటి ఏరియా ఆసుపత్రి వైద్యులు డేవిడ్ సుకుమార్, డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రవి, కమిటీ సభ్యులు ఖాదర్‌బాషా, రాయదుర్గం లక్ష్మీదేవి, పలువురు వైద్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హౌస్ బిల్డింగ్ సొసైటీకి ఎనిమిది నామినేషన్లు

- నేడు నామినేషన్ల పరిశీలన..24న ఉపసంహరణ

మదనపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలకు ఎనిమిది మంది నామినేషన్లు దాఖలు చేశారు. స్థానిక సొసైటీ కాలనీలోని సహకార శాఖ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల అధికారి రాజశేఖర్‌రెడ్డి, సొసైటీ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌కుమార్‌లు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. ఇందులో బి.మహేష్‌కుమార్, ఎం.పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్.రెడ్డెప్ప, కె.వీరవెంకటశివాజీ, బి.శివానందనాయక్, కె.వెంకటాచలపతి, ఎస్.రెడ్డిషంషీర్, యు.నరేష్‌లు ఉన్నారు. ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలను సహకార శాఖ అధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అక్రమాలకు చెక్ పెట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. మొత్తం 239 మంది ఓటర్లు ఉండగా అయిదేళ్ల పదవీ కాలంతో జరిగే ఈ ఎన్నికల్లో ఏడుగురు పాలకవర్గ సభ్యులు ఉండగా, వీరి నుంచి ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. పోలీసు బందోబస్తు మధ్య నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాగా, గురువారం నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అభ్యర్థులను ప్రకటించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఏడుగురు సభ్యులే ఉంటే ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులుగా ఎన్నికల అధికారి ప్రకటించనున్నారు. ఎనిమిది మంది పోటీలో ఉంటే తర్వాత అవసరాన్ని బట్టి 29న పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో రెండు వర్గాలు పోటీ పడతాయని అటు స్థానికులు, ఇటు అధికారులు భావించారు. అయితే అందుకు భిన్నంగా ఒక వర్గం అభ్యర్థులు మాత్రమే ఎన్నికలకు ఉత్సాహం చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. కార్యక్రమంలో సహకార శాఖాధికారులు బి.దుర్గమ్మ, ఆడిటర్ రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె సర్వేయర్‌పై విచారణ

కలికిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె హంద్రీ-నీవా సుజల స్రవంతి యూనిట్-1లో స్పెషల్ సర్వేయర్‌గా పనిచేస్తున్న గుండ్రామి వెంకట్రమణపై విచారణ జరపాలని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. భారీగా అక్రమాస్తులు కూడబెట్టిన వ్యవహారంలో గతంలో ఏసీబీ నమోదు చేసి కేసుకు సంబంధించి ఆ శాఖ డైరెక్టర్ జనరల్ ఆగస్టు 22న ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను పరిశీలించిన అనంతరం సర్వేయర్‌పై విచారణ చేపట్టాలని నిర్ణయించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సర్వేయర్‌గా పనిచేస్తూ మదనపల్లెలో భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ చేసిన తనిఖీల్లో వెల్లడయ్యింది. ఆస్తుల కొనుగోలుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు పొందలేదని, లేదా ఆస్తులకు సంబంధించిన వార్షిక నివేదికలను ప్రభుత్వానికి తెలియబరచలేదని కూడా ఏసీబీ ఆరోపించింది. విచారణను కొనసాగించడానికి ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి బుధవారం అభియోగాలకు సంబంధించిన చార్జిషీటు జారీ చేశారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్ష


ముద్దాయి మహబూబ్‌బాషాను జైలుకు తరలిస్తున్న పోలీసులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతికి కారణమైన నిందితుడికి మదనపల్లె పీడీఎం కోర్టు ఏడాది జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే... మదనపల్లె మండలం ఆరోగ్యవరం వద్ద 2021 ఫిబ్రవరి 12 తేదీ ద్విచక్రవాహనంలో వెళుతున్న శ్రీహరి, తరుణ్‌కుమార్, ధనుష్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మిత్రులు అక్కడికక్కడే మృతి చెందారు. మదనపల్లె తాలూకా ఏఎ్‌సఐ సుబ్రమణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు మదనపల్లె పీడీఎం కోర్టుకు విచారణ రాగా కేసు పూర్వాపరాలు విచారించిన న్యాయాధికారి సుభాన్ తీర్పు ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతికి కారణమైన రాయచోటికి చెందిన లారీ డ్రైవర్ మహబూబ్‌బాషాకు ఏడాది జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధించారు.

స్త్రీనిధి దుర్వినియోగంపై విచారణ



సంఘమిత్ర స్వాతి, మహిళా సమాఖ్య అధికారులను విచారిస్తున్న సీఐ కళా వెంకటరమణ


మదనపల్లె టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మహిళా సమాఖ్య పరిధిలోని రేగంటివారిపల్లె 30 ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యుల స్త్రీనిధి డబ్బు దుర్వినియోగంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. బుధవారం స్థానిక తాలూకా పోలీసుస్టేషన్‌లో సీఐ కళా వెంకటరమణ ఆధ్వర్యంలో ఏపీఎం ఖిజర్‌అహ్మద్ సమక్షంలో రేగంటివారిపల్లె సంఘమిత్ర స్వాతిని విచారించారు. 30 గ్రూపు సభ్యుల రూ.36 లక్షల స్త్రీ నిధి డబ్బు జమ చేయకపోవడంతో బ్యాంకు అధికారులు సంఘ సభ్యులకు నోటీసులు ఇచ్చారు. దీంతో ఆందోళన చెందిన మహిళా సభ్యులు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సీఐ సంఘమిత్ర స్వాతిని పిలిచి విచారించారు. సంఘసభ్యులు చెల్లించిన డబ్బుకు రసీదులు ఉన్నాయా అని ప్రశ్నించారు. డబ్బు దుర్వినియోగంపై మూడు రోజుల్లో విచారించి బాధితులకు న్యాయం చేస్తామని ఏపీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్, ఏసీ సాంబశివ, సీసీలు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేయాలి


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శివరామ్

మదనపల్లె టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మార్కెట్‌కు వచ్చే టమోటా రైతుల శ్రేయస్సే ధ్యేయంగా మార్కెట్ కమిటీ సభ్యులు పనిచేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులోని సమావేశ మందిరంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్ అధ్యక్షతన ట్రేడర్లు, వ్యాపారులు, రైతులతో సమావేశమైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్‌లో జాక్‌పాట్ విధానం రద్దు చేయాలని, కమీషన్ విషయంలో నిబంధనలు పాటించాలన్నారు. మార్కెట్‌లో వేలం టైమింగ్ మార్పు, 25 కిలోల క్రేట్ల బదులు, చిన్న క్రేట్ల వినియోగంపై చర్యలు చేపట్టాలన్నారు. దేశంలో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న మదనపల్లె మార్కెట్‌కు పూర్వవైభవం తీసుకురావాలన్నారు. చైర్మన్ శివరామ్ మాట్లాడుతూ మధ్యాహ్నం పూట వేలం నిర్వహిస్తే టమోటాకు ధరలు వస్తాయని తెలుస్తోందన్నారు. వ్యాపారులు, రైతులు నష్టపోకుండా నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ ఆంజనేయులు, డైరెక్టర్లు సి.నరసింహులు, జిలానినూరున్నిసా, డ్యాన్స్ రెడ్డెప్ప, మున్నా నాయక్, లక్ష్మీపతి, శ్యామల, కార్యదర్శి జగదీష్, సహాయ కార్యదర్శి అభిలాష్, రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించండి


పూలతోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి

మదనపల్లె టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరుస వర్షాలతో దెబ్బతిన్న ఉద్యానపంటలను కాపాడుకోవడంలో రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి తెలిపారు. బుధవారం మదనపల్లె మండలం సీటీఎం కొత్తవారిపల్లె గ్రామాల వద్ద ఉద్యానపంటలను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ టమోటా పంట సాళ్లలో నిలిచిన వర్షపు నీటిని దిగువ ప్రాంతాల్లోకి పారేలా రైతులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షం ఆగిన వెంటనే 5 లీటర్ల నీటికి 19-19-19 కలిపి సూక్ష్మపోషకాలతో నీటి మిశ్రమాన్ని పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లె ఉద్యాన శాఖ అధికారి ఈశ్వరప్రసాద్‌రెడ్డి, వీఏఓలు, పాల్గొన్నారు.

ఉపాధి హామీ అంబుడ్స్ పర్సన్‌గా శ్రీరాములు

కలికిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలును పర్యవేక్షిస్తూ సమస్యలను, ఫిర్యాదులపై విచారణ జరిపి పరిష్కార మార్గాలు సూచించడం కోసం జిల్లా అంబుడ్స్ పర్సన్‌గా కె.శ్రీరాములును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. కూలీలు, ఇతర వర్గాల నుంచి అందే ఫిర్యాదులను అంబుడ్స్ పర్సన్ పరిష్కరించి చర్యల కోసం ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంది. జిల్లాలో ఉపాధి హామీలో జరిగే అక్రమాల గురించి ప్రతి మూడు నెలలకూ ప్రభుత్వానికి నివేదికలు అందజేయాల్సి వుంది. అంబుడ్స్ పర్సన్ నియామకం, విధులు, బాధ్యతలకు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'పండని' తమలపాకులు



రాంసాయినగర్‌లో సాగు చేసిన తమలపాకు తోట

- మూడేళ్లుగా కనిపించని లాభాలు
- సాగుకు వెనుకాడుతున్న రైతులు

దువ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు తమలపాకును లక్ష్మితో సమానంగా చూస్తారు. తమలపాకు తోట ఉంటే లాభాలు వెంట ఉన్నట్లేనని భావిస్తారు. ఇది మునుపటి పరిస్థితి. ఈ తోటలు సాగు చేసిన రైతులు లాభాలమాట అటుంచి నష్టాలు మూటకట్టుకోకపోతే చాలు అనే అభిప్రాయంలో ప్రస్తుతం ఉన్నారు. అయితే ఎప్పుడో ఒకసారి ధరలు పండకపోతాయా, లాభాలను ఆర్జించలేక పోతామా అనే ఆశతో ముందుకు సాగుతున్నారు.

దువ్వూరు మండలంలో ఒకప్పుడు 150 ఎకరాల దాకా తమలపాకు తోటలు ఉండేవి. ఆ విస్తీర్ణం బాగా తగ్గి నేడు 70 ఎకరాలకు వచ్చింది. ఈ పంట సాగులో లాభాలు రాకపోవడమే కారణమని రైతులు వాపోతున్నారు. మండల పరిధిలో దువ్వూరు, రాంసాయినగర్, మూడిండ్లపల్లె, ఇడమడక, క్రిష్ణంపల్లె ప్రాంతాల్లో ఈ తమలపాకు తోటలు సాగు చేసేవారు. అయితే గిట్టుబాటు ధరలు లేకపోవడంతో సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. మునుపు ధరలు ఆశాజనకంగా ఉండేవి. 60 కట్టలు (సట్టలు) కలిగిన బుట్ట ధర రూ.3వేలకు పైగా ధర ఉండేది. ప్రస్తుతం అదే బుట్ట రూ.700 నుండి రూ.1000కి పడిపోయి మూడేళ్లుగా ఆటుపోట్ల మధ్య కొనసాగుతోందని రైతులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. మునుపు చెన్నై, హైదరాబాదు, నిజమాబాదు, బెల్గాం, కొల్హాపూర్, ముంబై, సోలాపూర్ ప్రాంతాలకు తమలపాకులు ఎగుమతి చేసేవారు. మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో ప్రస్తుతం చెన్నై, హైదరాబాదుకు మాత్రమే ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తున్నారు.

భారీగా పెట్టుబడి వస్తోంది..



తమలపాకు తోటలు సాగు చేయాలంటే పెట్టుబడులు భారీగా అవుతున్నాయి. ఎకరాలో ఈ పంట వేస్తే దిగుబడి అందే సమయానికి రూ.3లక్షలు ఖర్చు అవుతోంది. రాంసాయినగర్, మూడిండ్లపల్లె, నాగసానిపల్లె గ్రామాల్లో నేను తమలపాకు తోటలు సాగు చేశాను. లాభాలు కనిపించక మూడేళ్లు అవుతోంది. చాలా మంది వీటి సాగుకు వెనుకడుగువేస్తున్నారు. ఆశకొద్దీ కొందరం తోటలు కోస్తున్నాం. పరిస్థితి ఇలాగే కొనసాగితే తమలపాకు సాగుకు చరమగీతం పాడుతాం.

- ఎన్.వెంకటేశ్వరరెడ్డి, రైతు, పెద్దజొన్నవరం

ఘనంగా ఆకాశ దీపోత్సవం



ఆకాశ దీపాన్ని లాగుతున్న ఈఓ కృష్ణానాయక్, రాజారెడ్డి

పెండ్లిమర్రి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన పొలతల మల్లికార్జునుడి దేవస్థానంలో బుధవారం ఆకాశ దీపోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఈఓ కృష్ణానాయక్ మాట్లాడుతూ కార్తీక మాస ఉత్సవాలను పురష్కరించుకుని భక్తుల సౌకర్యార్థం వృద్ధులు, వికలాంగులు, చిన్నపిల్లల తల్లులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే ఉచిత ప్రసాదం, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ క్రీడా పురస్కారాల కోసం దరఖాస్తులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, క్రీడా విభాగం ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి జాతీయ క్రీడా పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జున అవార్డు, అర్జున (లైఫ్ టైం అవార్డు), మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు, ద్రోణాచార్య అవార్డు, ద్రోణాచార్య (లైఫ్ టైమ్ అవార్డు), రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహక పురస్కార్‌లకు అర్హత కలిగిన క్రీడాకారులు, కోచ్‌లు సంస్థలు www.dbtyas-sports.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 28వ తేదీ రాత్రి 11.59 గంటల వరకు పంపుకోవచ్చని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు, కోచ్‌లు, సంఘాలకు సంబంధించిన వివరాలపై పోర్టల్‌లో లభ్యమయ్యే మార్గదర్శకాలు పరిశీలించి, గడువులోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలియజేశారు.

ఎస్‌జీఎఫ్ డివిజనల్ స్థాయి ఎంపికలు



డివిజనల్ స్థాయి యోగా విజేతలు

పులివెందుల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (రమణప్ప)లో బుధవారం ఎస్‌జీఎఫ్ డివిజన ల్ స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా బుధవారం యోగా, చెస్, వాలీబాల్, సెటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారిని ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ డివిజనల్ కోఆర్డినేటర్ ఫ్రాన్సిస్ రవికుమార్, జిల్లా కార్యదర్శి విక్టర్ ఇమ్మానియేల్, ఆర్గనైజర్స్ జీవీసీ కేల్కర్, టీ.ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డిలు తెలిపారు.

క్లబ్బులపై డీఎస్పీ బృందం దాడి



క్లబ్బులో వార్నింగ్ ఇస్తున్న డీఎస్పీ మురళినాయక్

పులివెందుల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని రెండు క్లబ్బులపై డీఎస్పీ మురళినాయక్ బృందం దాడులు నిర్వహించింది. బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని లయన్స్ క్లబ్, లిటరరీ క్లబ్‌లపై దాడులు నిర్వహించారు. గతంలో ఈ రెండు క్లబ్బులలో ఎలాంటి గ్యాంబ్లింగ్ ఆడవద్దని డీఎస్పీ ఆదేశించారు. అప్పటి నుంచి గ్యాంబ్లింగ్ జరగలేదు. కానీ గత రెండు మూడు రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో డీఎస్పీ, అర్బన్ సీఐ సీతారామిరెడ్డి, ట్రాఫిక్ సీఐ హాజీవలి, వేముల ఎస్ఐ ప్రవీణ్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అక్కడున్న వారికి డీఎస్పీ వార్నింగ్ ఇచ్చారు. గ్యాంబ్లింగ్ వంటి కార్యక్రమాలు చేపడితే కేసు నమోదు చేసి కోర్టుకు పంపిస్తామని హెచ్చరించారు.

నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ

- మున్సిపల్ వర్కులపై నివేదిక ఇవ్వాలని లేఖ
- వర్కుల జాబితా సిద్ధం చేసి పంపిన మున్సిపల్ అధికారులు



ప్రొద్దుటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సి పాలిటీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ కడప రీజనల్ అధికారులు దృష్టి సారించారు. ఆమేరకు 2019 జూన్ నుం చి 2024 మే వరకు మున్సిపా లిటీలో జరిగిన వర్కులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌కు అక్టోబరు 9వ తేదీ విజిలెన్స్ అధికారులు లేఖ పంపారు. అందులో అక్టోబరు 16 లోపల బేసిక్ డేటా ప్రొఫార్మ-ఏ, ప్రొఫార్మ 501, 501 ఏ, 501బీలలో రూపొందించిన విధంగా సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే బిల్లులకు సంబంధించి పేమెంట్స్ ఎంత మేర జరిగాయో తెలపాలన్నారు. ప్రోగస్ ఆఫ్ వర్క్, చెక్‌మెజర్‌మెంట్ స్టేట్ మెంట్ తదితరాలు సమర్పించాలని కోరారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 1100 వర్కులు జరిగాయి. ఇందులో టెండర్ నిబంధనల ఉల్లంఘనలు వున్నాయి. ముఖ్యంగా ఒకే వర్కును నాలుగు భాగాలుగా విభజించి రూ.40లక్షల లోపు పనులు చేశారని ఆరోపణలున్నాయి. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 15 ఫైనాన్స్ గ్రాంట్ వర్కులను జనరల్ ఫండ్ కింద పనులు చేసి, నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగాలున్నాయి. జనరల్ ఫండ్ వాడు కోవాల్సిన లిమిట్స్ కంటే అధికంగా దుర్వినియోగం చేసి.. దాదా పు రూ.70కోట్ల మేర ఖర్చు చేశారని ఆరోపణలున్నాయి. సింగ ల్ టెండర్లు ఎక్సెస్ రేట్లకు టెండర్లు వేసినవి కూడా టెండర్ నిబంధనలు ఉల్లంఘించి చేసినవి వున్నట్లు ఆరోపణలున్నాయి. గత ఏడాది నవంబరులో మున్సిపల్ ఆర్‌డీ నేతృత్వంలో దాదా పు నెల రోజులపాటు నాలుగు జిల్లాల అధికారులు ప్రత్యేక టీంలుగా వచ్చి విచారణ చేపట్టారు. కానీ ఆ విచారణ నివేదిక ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వానికి అందజేసినా నేటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నేడు మళ్లీ విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వైసీపీ హయాంలో మున్సిపాలిటీలో జరిగిన పనులపై విచారణ చేపట్టనున్నారు. దీంతో ఏడాదికి పైగా వైసీపీ అక్రమాలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన జరగుతూనే వుందనే ఆరోపణలున్నాయి.

అప్పుల బాధతో రైతు మృతి



నాయుడు బాబు (ఫైల్)

పోరుమామిళ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక కల్వకూరి నాయుడు బాబు (35) అనే రైతు విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధి కమ్మవారిపల్లె సమీపంలోని చెంచు కాలనీకి చెందిన నాయుడు బాబు ఐదేళ్లక్రితం తనకున్న ఎకరా పొలంతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పసుపు, పత్తి పంటలు సాగు చేశాడు. సక్రమంగా పండకపోవడంతో నష్టాన్ని చవిచూశాడు. దీంతో పంటల సాగుకోసం చేసిన అప్పులు ఐదేళ్లకు రెట్టింపు కావడంతో వ్యవసాయం వదిలి కూల్‌డ్రింక్ షాపు నిర్వహించాడు. అందులో కూడా నష్టాలు రావడంతో ఈనెల 18న విషద్రావణం తాగాడు. కుటుంబ సభ్యులు పోరుమమిళ్లలోని ఆసుపత్రికి.. అక్కడి నుంచి నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ విషయాన్ని మృతుని తల్లి కలవకూరి లక్షుమ్మ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మృతుడికి భార్య సురేఖ, కుమార్తెలు వెంకటపూజిత, మౌనిత ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

విద్యుత్ షాక్‌తో పందులు మృతి



మృతి చెందిన పందులు

వల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం వల్లూరులోని సంపద తయారీ కేంద్రం వద్ద విద్యుత్‌షాక్‌తో మూడు పందులు మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. గత రాత్రి కురిసిన వర్షానికి వల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి, సచివాలయంలోకి వెళ్లే ప్రధాన రహదారిలో సంపద తయారీ కేంద్రం వద్ద విద్యుత్ తీగలు కిందకు వంగి రేకులకు తగిలాయి. ఆ రేకులు కాస్త ఇనుప గేటుకు అనుసంధానమై ఉండటంతో విద్యుత్ ప్రసరించి పందులు తగలగానే షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఓ పక్క వర్షం కురుస్తుండడంతో అక్కడ ఎవరూ లేకపో వడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం గమనించిన స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించగా వారు విద్యుత్ వైర్లను కట్ చేసి ప్రమాదాన్ని తప్పించారు. దీంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్లకు గాయాలు

సీకేదిన్నె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయచోటి రోడ్డులోని కొత్తరోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు, లారీ డ్రైవర్లు శ్రీనాథ్, యేసుదాసులకు స్వల్ప గాయాలయ్యాయి. రాయచోటి వైపు నుంచి కడపకు వస్తున్న మారుతీ కారు కొత్త రోడ్డు వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ కడప నుంచి డంపింగ్‌యార్డుకు చెత్తను తరలిస్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందుభాగం దెబ్బతింది. అదే సమయంలో కారులోని హెయిర్‌బెలూన్ తెరచుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గాయాలతో బయటపడిన డ్రైవర్లను హైవే పెట్రోలింగ్ పోలీసులు 108లో రిమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఘటనపై సీకేదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జమ్మలమడుగులో వ్యక్తికి...

జమ్మలమడుగు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ఎస్ఆర్ పెట్రోలు బంకు సమీపాన మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. జమ్మలమడుగు మెప్మా కార్యాలయంలో పనిచేస్తున్న రమణారెడ్డి అనే ఉద్యోగి జమ్మలమడుగు నుంచి రాత్రి ప్రొద్దుటూరుకు ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. ఎదురుగా వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో రమణారెడ్డికి తలకు, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి... అక్కడి నుంచి హైదరాబాదు యశోధ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు జమ్మలమడుగు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు అదృశ్యం



కేతనగిరి వెన్నెల

మైదుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణం కొత్త కొట్టాలకు చెందిన కేతనగిరి వెన్నెల ఈనెల 20వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగిరానట్లు ఆమె కుమారుడు వెంకటరమణ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సదరు మహిళ విషద్రావణం తాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడుతున్నట్లు సామా జిక మాధ్య మాలలో ఒక వీడియో ప్రసారం అవుతోంది. అయితే ఆమె కాదా అని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.



భూమిరెడ్డి ఇస్రాయిల్

మున్సిపాలిటీ పరిధి బద్వేలు రోడ్డులోని మహబూబ్ నగర్‌కు చెందిన భూమిరెడ్డి ఇస్రాయిల్ (35) ఈ నెల 3వ తేదీ అదృశ్యమయ్యాడు. ఇస్రాయిల్ కర్ణాటకు రాష్ట్రం బళ్లారికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో అతని భార్య భూమిరెడ్డి స్వప్న మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వీరి ఆచూకీ తెలిస్తే 9121100618, 9121100619 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.

హామీలను అమలు చేయాలి

వేంపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పింఛనర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికారప్రతినిధి తులసిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి చేస్తాం, మెరుగైన పీఆర్సీ అమలు చేస్తాం, అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్ ప్రకటిస్తాం, రావాల్సిన బకాయిలు చెల్లించే ఏర్పాటు చేస్తాం తదితర హామీలు ఇచ్చారన్నారు. ఉద్యోగస్తులు, ఉపాధ్యాయులు, పింఛనర్ల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం మాట తప్పిందన్నారు. అలాగే చంద్రబాబుపాలనలో రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అనారోగ్యశ్రీ అయిందని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు ప్రభుత్వానికి ఎన్నోమార్లు మొరపెట్టుకున్నాయన్నారు. కానీ ప్రభుత్వంలో చలనం లేదన్నారు.

పేదల బియ్యం అక్రమ రవాణాకు చెక్



తనిఖీలకు ఉపయోగించే కిట్

కడప కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కిచ్చే సబ్సిడీ బియ్యం అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. దొంగెవరో.. దొరెవరో అర్థం కానీ పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో అయితే ఇంటింటికి బియ్యం పంపిణీకి ఎండీ యూ వాహనాలకు లైసెన్స్ ఉండడంతో బియ్యం అక్రమ రవాణాకు ఆన వాళ్లు దొరకేవి కావు. ఇలాంటి పరిస్థితులను కట్టడి చేసేందుకు కూటమి సర్కారు నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. పేదల బియ్యం అనే విష యాన్ని గుర్తించేందుకు వీలుగా.. ఏసీబీ దాడుల్లో అవినీతి సొమ్ము ఎలా అయితే కెమికల్స్ ద్వారా గుర్తిస్తారో అదే తరహాలో అక్రమంగా తరలించే బియ్యాన్ని గుర్తించేందుకు ద్రావకంతో కూడిన కిట్లను జిల్లాల వారీగా సరఫరా చేశారు. ప్రభుత్వం పోషక విలువలతో రూపొందిం చిన ఫోర్టిఫైడ్ బియ్యంను ఈ కెమికల్స్‌తో పరీక్షల ద్వారా నిర్ధారించే అవకాశం ఉంది. దీంతో ఇన్నాళ్లు సాధారణ బియ్యం మాటున అక్రమంగా తరలిపోతున్న పేదల బియ్యం కట్టడికి రెడ్ సిగ్నల్ పడనుంది. బుధవారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురామ్ జిల్లాకు 9 కిట్లు రాగా అందులో నియోజకవర్గానికి ఒక కిట్ చొప్పున ఎన్‌ఫోర్సుమెంట్ డిప్యూటీ తహశీల్దార్లకు పంపిణీ చేశారు. మిగతా రెండు కిట్లను ఏఎస్‌వోలకు అందజేశారు.

ఇది...శ్మశాన వాటికే..!

- శవాలను పూడ్చలేని దుస్థితి
- ఏళ్ల తరబడి సాగుతున్న సమస్య
- పరిష్కారం చూపని అధికారులు, ప్రజాప్రతినిధులు



కంపచెట్లు, జంబుతో సమాధులు సైతం కనిపించని అలాంఖాన్‌పల్లె శ్మశానవాటిక



శ్మశానవాటిక చుట్టూ ఉన్న మురుగునీరు

కడప మారుతీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అది పేరుకే శ్మశానవాటిక. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే అక్కడ శవాలను పూడ్చలేని దుస్థితి. సాధారణంగా శ్మశాన వాటికలో ఎవరైనా మృతి చెందితే వారికి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. అయితే ఇక్కడ ఆ పరిస్థితి లేదు. శ్మశానవాటిక చుట్టూ మురుగునీరు, కంపచెట్లు, ఏపుగా పెరిగిపోయిన జమ్ముతో నిండి.. కనీసం శ్మశానవాటికలోని సమాధులు సైతం కనిపించని పరిస్థితి. ఇక గ్రామంలో ఎవరైనా మృతి చెందితే.. శవాన్ని శ్మశానవాటికలోకి తీసుకెళ్లాలంటే నరకయాతనే. ఈ దుస్థితి ఎక్కడో మారుమూల గ్రామంలో అనుకుంటే పొరపాటే. కడప నగరానికి అత్యంత సమీపంలోని ఆలంఖాన్‌పల్లె శ్మశానవాటికలో నెలకొంది.

కడప నగరం 49వ డివిజన్ పరిధిలోని ఆలంఖాన్ పల్లెలో దాదాపు వేల మంది జనాభా ఉన్నారు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని గ్రామ ప్రజలు ఏళ్ల తరబడి మొరపెట్టుకుంటున్నా పట్టించుకునేవారే లేరని వాపోతున్నారు. ఇటీవల శ్మశానంలో శవాన్ని పూడ్చే పరిస్థితి లేకపోవడంతో కడప-కర్నూలు రహదారిపై రాస్తారోకో చేపట్టి ఆందోళన చేశారు. దీంతో అధికారులు అక్కడకు వచ్చి సమస్యను పరిష్కరిస్తామని నచ్చజెప్పి... ఆ తర్వాత షరా మామూలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు దృష్టి సారించి శ్మశానవాటిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

కన్నీటి వర్షం

- చేతికొచ్చిన 'చిట్టిముత్యాలు' నీటిపాలు
- టమోటాను ఆశించిన తెగుళ్లు
- ముందుకురాని వ్యాపారులు
- లబోదిబోమంటున్న రైతులు



నందలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : చిట్టిముత్యాల వరి పైరు వర్షపునీటి పాలైందని ఖాసింసాహెబ్ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లె నుంచి గొల్లపల్లెకు వెళ్లే రహదారిలోని మూడెకరాల పొలంలో ఆయన వరి పైరు సాగు చేశాడు. గొల్లపల్లెకు వెళ్లే మార్గంలోని ప్రధాన కాలువ నీరు వరిచేనులోకి ప్రవహించడంతో పైరు నేలకొరిగింది. చెయ్యేరు నుంచి కన్యక చెరువు కు నీరు తరలించే ప్రధాన అక్కడక్కడ గండి పడడమే ఇందుకు కారణమని రైతు చెబుతు న్నాడు. ఈ పరిస్థితి రెండు రోజులు కొనసాగితే వరి మొత్తం కుళ్లిపోయి నష్టం వాటిల్లితుంద ఖాసిం సాహెబ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైన కాలువ నీరు వరిచేలల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరుతున్నారు.

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని పాటూరు పంచాయతీలో దాదాపు 20 ఎకరాల్లో వరిపైరు దెబ్బతినింది. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



నందలూరు: వర్షం కారణంగా దెబ్బతిన్న వరిపైరు

తెగుళ్లబారిన టమోటా..

గాలివీడు: కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు గాలివీడు మండలంలోని టమోటా రైతుల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. పంట చేతికొచ్చే వేళలో కురిసిన వర్షాల కారణంగా మచ్చ, గజ్జి తెగుళ్ల వ్యాపించడంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూస్తున్నారు. పట్టణంలోని చిలకలూరిపేటకు చెందిన టమోటా కౌలు రైతు రామాంజులునాయుడు రెండు ఎకరాల్లో టమోటా సాగుకు రూ.8 లక్షలు ఖర్చు పెట్టాడు. అయితే, కోతకొచ్చే సమయంలో వర్షాల బీభత్సంతో పంట పూర్తిగా దెబ్బతినింది. పండ్లపై నల్లమచ్చలు, పగుళ్లు, కుళ్లిపోవడం వంటి లక్షణాలు కనిపించడంతో మార్కెట్‌లో ఎవరూ కొనుగోలు చేయడంలేదని, దాంతో మొదటి కోత 70 క్రేట్లు, రెండవకోత 150 క్రేట్లు చొప్పున టమోటాలను పారబోయాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి మండలంలోని గొట్టివీడు, నూలివీడు, అరవీడు, ఇతర గ్రామాల్లోనూ కనిపిస్తోంది. వెంటనే ప్రభుత్వం స్పందించి పంట నష్టం అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గాలివీడు: వర్షానికి దెబ్బతిన్న టమోటాలను పారబోస్తున్న రైతు

ప్రజా శ్రేయస్సు కూటమి ప్రభుత్వ లక్ష్యం: మండిపల్లి



ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): జోరు వర్షానికి కూడా సైతం లెక్కచేయకుండా బుధవారం రాత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటి పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజల సమస్యలు, అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత ప్రభుత్వంలో లాగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌బాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వం ధ్యేయమన్నారు. ఈ సందర్భంగా మంత్రిని పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా వాటిని పరిష్కరించేందుకు మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, నాయకులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో మంత్రిని ఘనంగా సన్మానించారు.

చిన్నమండెం:మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో బుధవారం మధ్యాహ్నం మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు అధికారుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ప్రజలకు దగ్గరగా ఉంటూ ప్రతి సమస్యకు తక్షణ స్పందన, పరిష్కారమే లక్ష్యంగా కృషి చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కొలిక్కిరాని టీడీపీ బూత్ కమిటీల ఎంపిక

- మండల టీడీపీ అధ్యక్ష పదవికి భారీగా పోటీ
- కష్టపడిన వారికే పదవులు ఇవ్వాలని డిమాండ్
- రసాభాసతో సమావేశం వాయిదా



బూత్ కమిటీల నియామకంపై చర్చిస్తున్న పరిశీలకులు, ముక్కా

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో టీడీపీ బలోపేతం లక్ష్యంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండల స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా నిర్వహించిన రైల్వేకోడూరు పట్టణ బూత్ కమిటీల ఎంపిక ప్రక్రియలో వివాదం ఏర్పడడంతో సమావేశాన్ని గురువారానికి వాయిదా వేశారు. ఈ సమావేశానికి పరిశీలకులుగా హేమాంబరధరరావు, గురింజగుంట శివప్రసాద్‌నాయుడు, చైతన్య వ్యవహరించారు. పంచాయతీల వారీగా నాయకులతో చర్చించి మండలంలోని అన్ని పంచాయతీల బూత్ కమిటీల ఎంపికను ఓ కొలిక్కి తెచ్చారు. మండల, పట్టణ టీడీపీ అధ్యక్ష పదవులకు తీవ్ర పోటీ ఏర్పడింది. దీంతో పరిశీలకులు ఈ ఎంపికను గురువారానికి వాయిదా వేశారు. సమావేశంలో జడ్పీటీసీ మాజీ సభ్యురాలు బండారు సుభద్రమ్మ అలియాస్ ఫైర్ బ్రాండ్ బుజ్జమ్మ మాట్లాడుతూ పార్టీకి విధేయులుగా లేని వారికి పదవులు ఇస్తే.. మొత్తం తినేస్తారని, పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు ఇవ్వాలని, నష్టం చేసే వారిని పక్కన పెట్టాలని డిమాండ్ చేశారు. విశ్వాసంగా పని చేసే కార్యకర్తలను గుర్తించి పదవులు ఇవ్వాలని కోరారు. టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతం, పార్టీ ప్రతిష్ఠ కార్యకర్తలు, నాయకులకు అవసరమని తెలిపారు. రైల్వేకోడూరు బూత్ కమిటీ ఎంపికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పారదర్శకంగా పూర్తి చేస్తామని తెలిపారు. డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్, రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పుల్లెల రమేష్‌బాబు, టీడీపీ నాయకులు మలిశెట్టి మురళీధర్‌గౌడు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పఠాన్ మౌలా(అల్లబకాష్), సూరపురాజు సుబ్బరాజు, కంచిరాజు రామరాజు, పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, గడికోట సుబ్బరాయుడు, తల్లెం వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల తక్షణ పరిష్కారానికే ప్రజా దర్బార్ : చమర్తి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించడానికి, సమస్య మీది.. పరిష్కారం మాది అనే నినాదంతో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. బుధవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు తమ సమస్యలను చమర్తికి వివరించగా వెంటనే సంబం.దిత అదికారులకు ఫోన్ చేసి వాటిని పరిష్కరింపజేశారు. ఈ సందర్భంగా పలువురు సీఎం సహాయనిధికి సంబంధించిన అర్జీలను అందజేశారు.

25న రెవెన్యూ డివిజన్ అసోసియేషన్ సమావేశం

రాజంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట రెవెన్యూ డివిజనల్ అసోసియేషన్ సమావేశం ఈనెల 25న జరుగుతుందని అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఈ సమావేశం రాజంపేటలో జరుగుతుందన్నారు. అసోసియేషన్ కాల పరిమితి పూర్తయినందున ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ ఎన్నికలపై చర్చ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

పండ్లు, బ్రెడ్డు పంపిణీ

వీరబల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ సీనియర్ నాయకులు తాటిగుట్ల శ్రీధర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఆయన ఇంట్లో అభిమానులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి బాణసంచా పేల్చి జన్మదిన వేడుకలు తెలియజేశారు.

భుజంగేశ్వరుడికి పూజలు

రైల్వేకోడూరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా బుధవారం స్థానిక భుజంగేశ్వరాలయంలో అర్చకులు బోయలకుంట్ల పవన్‌కుమార్‌శర్మ, ధూర్జటి యోగి ఆధ్వర్యంలో అభిషేకాలు పూజలు నిర్వహించారు. ఆకాశ దీపం వెలిగించారు. పెద్దఎత్తున భక్తులు హాజరై పూజలు చేశారు.

అయ్యప్ప దీక్షలు ప్రారంభం

రైల్వేకోడూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ప్రారంభం కావడంతో అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం మాలధారణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అర్చకులు బండాత్మకూరు సుదర్శన్‌శర్మ మాట్లాడుతూ అయ్యప్ప భక్తులకు నియమాలను తప్పకుండా పాటించాలని అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

పక్కా గృహాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దవటం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) :ఇళ్లు లేని నిరుపేదలు పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోవాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి నాగ మునిరెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లులేని నిరుపేదలను గుర్తించేందుకు కేంద్ర గృహ నిర్మాణశాఖ చేపట్టిన సర్వే గడువు రెండు నెలల క్రితమే ముగిసింది. అయితే, రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఐదు లక్షల మందికి పైగా పేదలు ఇళ్లు లేకుండా ఉన్నారని, అధికారులు గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఇటీవల నివేదించారు. దీనిపై స్పందించిన సీఎం వెంటనే కేంద్రానికి లేఖ రాశారు. దీంతో తాజాగా కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లో సర్వేకు ప్రత్యేకంగా అవకాశం కల్పించింది. నవంబరు 5 వరకు గడువు ఇచ్చిం ది. అర్హులైనవారు ఉంటే హౌసింగ్ ఏఈ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

'కార్పొరేట్'లను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి

రాయచోటిటౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్, మతతత్వ, శక్తులను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని జిల్లా సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ పిలుపునిచ్చారు. డిసెంబర్ నెల 6, 7వ తేదీల్లో కడపలో నిర్వహించనున్న పార్టీ 9వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి, సంపద సృష్టి, సంక్షేమం చేస్తామని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన డబుల్ ఇంజన్ సర్కారు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని విమర్శించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన చంద్రబాబు, ప్రస్తుతం సంపదను కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే కార్యక్రమంలో ఉన్నాడన్నారు. ఐ సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్‌గా మిగిలాయన్నారు. డిసెంబర్ 6, 7తేదీల్లో కడపలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు రామాంజనేయులు, వెంకటచలపతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

26న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభ




మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు

రాయచోటి టౌన్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల 26న నిర్వహించనున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట విలేకర్లతో మాట్లాడుతూ హక్కులు, సమాన పనికి సమాన వేతనం పని గంటల పెంపు తదితర కార్మిక సమస్యలపై ఈ సమావేశంలో చర్చించి, భవిష్యత్ పోరాటాలకు ఈ సందర్భంగా ప్రణాళిక తయారు చేస్తారని తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ నుంచి నేతాజీ సర్కిల్, బస్టాండు మీదుగా ప్రీతం కల్యాణ మండపం వరకు నిర్వహించే ర్యాలీకి సకాలంలో హాజరుకావాలని మున్సిపల్ వర్కర్స్‌ను కోరారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా నాయకురాలు సామ్రాజ్యం, సీఐటీయూ జిల్లా ప్రధాన నాయకులు వస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి సీ. రాంబాబు, ఉపాధ్యక్షుడు చెన్నయ్య, శంకరయ్య, నాయకులు దేవా, శేఖర్, బాలాజీ, గురువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆచూకీ కోసం గాలింపు

సిద్దవటం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని డేగనవారిపల్లెకు చెందిన అమ్మన్ని(59) అనే మహిళ బుధవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పెన్నా పరివాహక ప్రాంతాల్లో కడప ఫైర్, రెస్క్యూ టీమ్ సాయంతో పెన్నానదిలో విస్తృతంగా గాలిస్తున్నామని సీఐ బాబు తెలిపారు.



ప్రభుత్వ భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న చెంచర్ల ఆంజనేయులు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లు వేసి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జైభీమ్ సేవా సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు చంచర్ల ఆంజనేయులు కోరారు. బుధవారం అక్రమణలకు గురైన భూముల్లోకి వెళ్లి పరిశీలించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ నరసింహులుకు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లెలోని 217 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసి కోటి రూపాయలకు విక్రయిస్తున్నారని రెవెన్యూ అధికారులు ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. దొర్రిచెరువు కొండను ఎక్స్‌క వేటర్‌తో తవ్వేసి చదును చేశారని, గ్రామంలో ఎక్కడ ప్రభుత్వ భూమి ఉన్నా, ఆక్రమించుకొని లేఅవుట్లు వేసి విక్రయిస్తున్నారన్నారు.

సర్వే నెంబర్ 921/1లో రెడ్డివారిపల్లెకు చెందిన కొంత మంది వ్యక్తులు గుట్టను చదును చేసి లేఅవుట్‌లు వేసి విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ భూములు విక్రయించకుండా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేని పక్షంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రంలో జేబీఎస్ఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు లక్కీ శశిధర్, జిల్లా నాయకులు గంగాధర్, అబ్బాస్‌అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి చికిత్సకు రూ.5 లక్షలు ఆర్థికసాయం



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న మంత్రి సత్యకుమార్

రాజంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : బధిరుడైన విద్యార్థికి చికిత్స చేయించేందుకు రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ రూ.5 లక్షలు సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయించారు. పుల్లంపేట మండలం వత్తలూరు గ్రామానికి చెందిన కె.మహేన్నాథరెడ్డి బధిరుడు. రెండో తరగతి చదువుతున్న అతనికి అత్యవసర చికిత్స చేయిం చాల్సి ఉందన్న విషయాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేశ్ నాయుడు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేశ్‌కుమార్ బుధవారం మంత్రి దృష్టికి దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన వెను వెంటనే సీఎం కార్యాలయంలో సంప్రదించి అత్యవసర చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నిధుల కింద 5 లక్షల రూపాయలను విడుదల చేయించి విజయవాడలో విద్యార్థి తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా సాయిలోకేశ్ మాట్లాడుతూ తాము సమస్యను మంత్రికి తెలియజేసిన వెంటనే స్పందించి, ఆదుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియాఖాతున్ పాల్గొన్నారు.

ప్రవాహాల వద్ద అప్రమత్తంగా ఉండాలి : సబ్‌కలెక్టర్



బాలిరెడ్డిపల్లె కాజ్‌వే వద్ద రాకపోకలు నిషేధిస్తున్న సబ్‌కలెక్టర్ భావన

ఓబులవారిపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బాలిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో వరద ప్రభావాన్ని రాజంపేట సబ్ కలెక్టర్ భావన బుధవారం పరిశీలించారు. గుండాలేరులో ప్రవాహం ఎక్కువగా ఉండడం గమనించి బాలిరెడ్డిపల్లె - వై.కోట మధ్య ఉన్న లోతట్టు బ్రిడ్జిపై రాకపోకలను తాత్కాలికంగా బంద్ చేయించారు. ప్రవాహం తగ్గేవరకు వాహనాలు, ప్రజలు వెళ్లనీయరాదని మండల అధికారులకు సూచించారు. తహసీల్దారు యామిని, ఎంపీడీవో విజయ్‌రావుఆర్ఐ మల్లికార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బాలిరెడ్డిపల్లె టీడీపీ నాయకుడు జీవీ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పుల్లంపేట : బోటుమీదపల్లె వద్ద పుల్లంగేరును సబ్‌కలెక్టర్ పరిశీలించారు. లోలెవల్ వంతెనపై ఎవరూ వెళ్లకుండా ఇరువైపులా అడ్డంగా ఆమె కంప వేయించారు. తహసీల్దారు పుల్లారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమరాజు చెరువుకు నీరు

చిట్వేలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగుతున్నాయి. బుధవారం కురిసిన వర్షానికి గుంజనేరు ప్రవహిస్తోంది. శ్యామకోన, గుండాల కోన వాగుల గుండా ఎల్లమరాజు చెరువుకు నీరు చేరుతోంది. ఈ చెరువు నిండితే రెండేళ్ల వరకు నీరు పుష్కలంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి

రాయచోటి-కలెక్టరేట్ , అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రాయచోటి పట్టణ ప్రజలు వంకలు, వాగులు పరిసరాలకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని రాయచోటి ఫైర్ ఆఫీసర్ వెంకట్రామిరెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. వంకలు, వాగులు పొంగి ఇబ్బందికర పరిస్థితులు ఎదురైతే వెంటనే 101 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేయాలని 24 గంటలు తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

పింఛా ప్రాజెక్టు పరిశీలన



ప్రాజెక్టు అధికారులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ వరప్రసాద్

సుండుపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పింఛా ప్రాజెక్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండడంతోపాటు, ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించాలని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. బుధవారం పింఛా ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. ఏఈ నాగేంద్రనాయక్‌ను అడిగి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను తెలుసుకు న్నారు. ప్రాజెక్టు సందర్శనకు విచ్చేసిన సందర్శకులకు సలహాలు, సూచనలు ఇచ్చి జాగ్రత్తగా ఉండాలని తెలియజేశారు. సందర్శకులు నీటిలో దిగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

రాజంపేటలో ఓ మోస్తరు వర్షం

రాజంపేట టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో బుధవారం ఉదయం కురిసిన వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. పుల్లంగేరు వరదతో పోలి చెరువుకు నీరు చేరుతోంది. మండలంలోని ఊటుకూరు, తాళ్లపాక, బ్రాహ్మణపల్లె, ఆకేపాడు, మిట్టమీదనల్లె, మందపల్లె, పులపత్తూరు, గ్రామాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. అక్కడకక్కడ వరిపంట దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. పింఛా ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయడంతో చెయ్యేటికి వరద పెరుగుతోంది.

వర్షంతో నాలుగు గ్రామాల ప్రజల్లో ఆందోళన

పెనగలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గుంజనేరుకు వరద వస్తుండడంతో ఇతర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉందని పల్లంపాడు, నర్సింగరాజపురం, దిగువ సిద్దవరం, సింగనమల గ్రామాల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పింఛా డ్యాం నుంచి చెయ్యేటికి నీరు వదలడంతో పరివాహక ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పెనగలూరు తహసీల్దారు డి.అమరేశ్వరి, ఎస్.ఐ బి.రవిప్రకాష్‌రెడ్డి వాగులు, వంకల వద్ద సిబ్బందిని నియమించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

31 నుంచి కుంభాభిషేక ఉత్సవాలు

రాజంపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తాళ్లపాక అన్నమాచార్యుల విగ్రహం వద్ద నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 31 నుంచి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. 31వ తేదీ సాయంత్రం యజమాన సంకల్పం, విష్వక్సేన ఆరాధన, యాగ సంకల్పం, రక్షాబంధనం, హోమాలు, పంచగవ్య ప్రోక్షణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, నవంబరు 1న ఉదయం భగవత్పుణ్యాహవచనం, శాంతి హోమం, మహాకుంభారాధనం, ద్వాదశాక్షర, అష్టాక్షర, షడక్షర, విష్ణుగాయత్రి, పూర్ణాహుతి, సాయంత్రం మూర్తి హోమం, వేద, ప్రబంధ విష్ణు సహస్రనామ పారాయణం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. 2 న ఉదయం భగవత్పుణ్యాహవచనం, విమానగోపుర, ధ్వజ ప్రసాదములకు ఛాయాధివాసం, హోమాలు, పూర్ణాహుతి, మహర్నివేదన, సాయంత్రం చతుస్థానార్చన, శయ్యాదివాసం, జీవాది తత్వన్యాస హోమం, పంచసూక్త హోమం, పూర్ణాహుతి, గోష్ఠి, 3 న ఉదయం 9 గంటలకు మహాపూర్ణాహుతి, మహా కుంభప్రోక్షణ, ప్రాణ ప్రతిష్ఠ అనంతరం ధ్వజారోహణం, మహా నివేదన, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం 6 గంటలకు శ్రీనివాస కల్యాణోత్సం, ధ్వజావరోహణం, సంప్రోక్షణంతో ముగియనుందని తెలిపారు.

దెబ్బతిన్న రోడ్డు పరిశీలన

సిద్దవటం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : లంకమల అటవీ ప్రాంతంలోని సాహెబ్‌బావి సమీపంలో దెబ్బతిన్న సర్వీసు రోడ్డును బుధవారం ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డుపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. హెడ్‌కానిస్టేబుల్ కొండయ్య పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

సిద్దవటం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఈనెల 24వ తేదీ వరకు కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు తిరుమలబాబు తెలిపారు. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా ముందస్తు చర్యగా దీనిని ఏర్పాటు చేశారన్నారు.

వర్షాకాలంలో పీలేరు వారపు సంతలో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులకు ఈ చిన్నారి ప్రయత్నం అద్దం పడుతోంది. పీలేరులో మంగళవారం కురిసిన వర్షానికి సంత ప్రాంగణం చిత్తడిగా మారింది. తండ్రితో పాటు సంతకు వచ్చిన ఓ కుర్రాడు బురదలో నడవలేక కోడి గుడ్ల అట్టలతో దారి ఏర్పాటు చేసుకుని తండ్రి వద్దకు చేరుకున్నాడు. వర్షాకాలంలో సంతలోని వ్యాపారులు, కొనుగోలుదారులు కొబ్బరి పీచు, పాత పేపర్లు, ప్లాస్టిక్ పేపర్లతో దారులు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది.


ప్లాస్టిక్ పట్టల కింద జరుగుతున్న పీలేరు వారపు సంత


సంతలో చెత్త కుప్పల పక్కనే ఏర్పాటైన దుకాణాలు

ప్లాస్టిక్ పట్టలే.. ఆవాసాలుగా..




పీలేరు సంతలో కోడి గుడ్ల అట్టలతో దారి ఏర్పరచుకుంటూ నడుస్తున్న ఓ బాలుడు

● ఆదాయం ఘనం...వసతులు శూన్యం ● అభివృద్ధికి నోచుకోని పీలేరు వారపు సంత
● చినుకు పడితే చిత్తడే.. ● నీడ, నీరూ కరువే

పీలేరు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నిలకడగా ఆదాయం అందించే వనరులను అభివృద్ధి చేసుకుని దానిని సుస్థిరం చేసుకునేందుకు వ్యక్తులైనా, సంస్థలైనా చర్యలు తీసుకోవడం సర్వసాధారణం. పీలేరు గ్రామ పంచాయతీ అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అత్యంత ప్రాచీనమైన, అత్యంత ఎక్కువ ఆదాయం తెచ్చిపెట్టే సంతగా పేరొందినా అభివృద్ధికి మాత్రం ఆమడదూరంలో నిలిచిపోయింది పీలేరు వారపు సంత. ఎన్నో పాలకవర్గాలు మారినా పీలేరు వారపు సంత అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. దీంతో సంతకు వచ్చే రైతులు, వ్యాపారులు, వినియోగదారులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, తీవ్ర దుర్గంధాన్ని భరిస్తూ తమ కార్యకలాపాలు సాగించాల్సి వస్తోంది.

సూపర్ మార్కెట్‌లకు తీసిపోని పీలేరు సంత

పీలేరులో ప్రతి మంగళవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో సంత జరుగుతుంది. సంతకు పీలేరుతో పాటు కేవీపల్లె, సదుం, పులిచెర్ల, కలికిరి, సోమల, పుంగనూరు మండలాల నుంచి పెద్దసంఖ్యలో రైతులు, పీలేరుతో పాటు కల్లూరు, పుంగనూరు ప్రాంతాల నుంచి చాలా మంది హోల్‌సేల్ వ్యాపారులు వస్తుంటారు. సూపర్ మార్కెట్లకు ఏమాత్రం తీసిపోని విధంగా నిత్యావసర సరుకులతో పాటు తాజా ఆకుకూరల దగ్గర నుంచి కాయగూరల వరకు సంతలో దొరుకుతాయి. సరుకుల రవాణాతో పాటు ప్రజల రాకపోకలకు కూడా సౌకర్యంగా ఉండడంతో పీలేరు పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులు తమకు వారానికి సరిపడా సరుకులు, కూరగాయలు పీలేరు సంత నుంచి తీసుకెళుతుంటారు. దీంతో గడిచిన దశాబ్దకాలంగా వారపు సంత వేలం పాట గణనీయంగా పెరిగింది.

దుర్గంధభరితంగా సంత ప్రాంగణం

సంత తరువాత మిగిలే వ్యర్థాలను శుభ్రపరచకపోవడంతో ఆ ప్రాంగణమంతా దుర్గంధభరితంగా మారుతోంది. దానికి తోడు సంత పరిసర ప్రాంతాల్లోని ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను సంతలోనే పారవేస్తుండడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. చెత్తాచెదారాల నడుమే రైతులు తమ కూరగాయలు విక్రయానికి పెట్టడం, విధి లేక వినియోగదారులు కూడా అక్కడే కొనుగోలు చేయాల్సి వస్తోంది. మందుబాబుల రూపంలో సంతకు మరో సమస్య ఎదురవుతోంది. పగిలిన మద్యం సీసాల కారణంగా చాలామంది గాయాల పాలవుతున్నారు.

అలంకారప్రాయంగా మరుగుదొడ్లు

సంతలోని మరుగుదొడ్లు అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. వాటికి నిరంతర నీటి సరఫరా లేకపోవడంతో అక్కడున్న కాంట్రాక్టరు అందించే అరకొర నీటితోనే ప్రజలు కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. సంతకు అధిక సంఖ్యలో వచ్చే మహిళా రైతులు మధ్యాహ్నంగానీ, రాత్రికి గానీ తమ ఇళ్లు చేరుతుంటారు. అంత వరకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వారు ఆరుబయట ప్రదేశాలను ఆశ్రయించక తప్పడం లేదు.

ఆదర్శం.. సదుం పంచాయతీ

సంత అభివృద్ధిలో పీలేరుకు పొరుగున ఉన్న సదుం పంచాయతీ ఆదర్శంగా నిలుస్తోంది. అక్కడున్న సంత ప్రాంగణంలో పక్కా నిర్మాణాలు ఉండడంతో అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు. పీలేరు పంచాయతీ అధికారులు, పాలకవర్గం ఇప్పటికైనా సంత అభివృద్ధి గురించి పట్టించుకోవాలని పట్టణ ప్రజలు, వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

సంత వేలం వివరాలు...

2021-22	రూ.10 లక్షలు
2022-23	రూ.10.85 లక్షలు
2023-24	రూ.12.65 లక్షలు
2024-25	రూ.10.47 లక్షలు(ఏడు నెలల కాలానికి)
2025-26	రూ.28.25 లక్షలు


సంత సగభాగంలో నిర్మించిన ప్లాట్‌ఫాంలు


వారపు సంతలో బురదతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వ్యాపారులు

సౌకర్యాలు కల్పిస్తే వ్యాపారాలు పెరుగుతాయి



సంతలో సరైన సౌకర్యాలు లేక మాలాంటి చిన్న వ్యాపారులకు వ్యాపారం అంతంత మాత్రంగానే జరుగుతా ఉంది. మట్టిలో కూర్చోవడమే కాకుండా కూరగాయలను కింద పెట్టుకోవడం వల్ల అవి దుమ్ముకొట్టుకుపోతున్నాయి. దీంతో చాలా మంది వాటిని చూడగానే ముఖం చిట్లిస్తున్నారు. ఇక వర్షం వస్తే మా పరిస్థితి దేవుడెరుగు. కూర్చోవడానికి కూడా వీలుండదు. సంతలో సౌకర్యాలు కల్పిస్తే మాలాంటి వాళ్లు ఇంకో నలుగురు బతుకుతారు.

- రెడ్డి శేఖర, చిరు వ్యాపారి, పీలేరు

ప్లాట్‌ఫాంలు నిర్మించారు.. పైకప్పు మరిచారు

సంత ప్రాంగణంలో సరైన సదుపాయాలు లేకపోవడంతో వ్యాపారులు ప్లాస్టిక్ పట్టల కింద దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. అటు వ్యాపారులు, రైతులు, ఇటు వినియోగదారులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ సంత చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో సంత ప్రాంగణంలో కాంక్రీట్ ప్లాట్‌ఫాంలు నిర్మించినా వాటికి పైకప్పు ఏర్పాటు చేయకపోవడంతో వాటి ఉపయోగం కూడా నామమాత్రంగా మిగిలింది. ఇక వర్షాకాలంలో వ్యాపారులు, ప్రజల బాధలు వర్ణణాతీతం. తమ వద్ద ముక్కుపిండి సెస్ వసూలు చేసే కాంట్రాక్టరు, పంచాయతీ పాలకవర్గం తమకు వసతులు కల్పించడంలో మాత్రం శ్రద్ధ చూపడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. సంత ప్రాంగణంలోనే ఓ ఓవర్‌హెడ్ ట్యాంకు, ఆర్వో ప్లాంటు ఉన్నా సంతలో తాగునీటి వసతి మరిచారు. ఎప్పుడైనా విమర్శలు వచ్చినప్పుడు నాలుగు రోజుల పాటు నాలుగు మట్టి కుండల్లో నీరు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

శుభ్రత పాటించని కోళ్లఫారాలకు నోటీసులు


కోళ్లఫారాల యజమానులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేశ్

నిమ్మనపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో పరిశుభ్రత పాటించని కోళ్ల ఫారాల యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీవో రమేశ్ తెలిపారు. కోళ్ల ఫారాలతో ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వాటిని తక్షణం మూసివేస్తామన్నారు. బుధవారం రాచవేటివారిపల్లి పంచాయతీలోని గోసిరెడ్డి నాగరాజుకు చెందిన కోళ్ల ఫారాల వలన గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు రావడంతో సిబ్బందితో కలిసి కోళ్లఫారాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ కోళ్ల ఫారాల యజమానులు కోళ్ల వ్యర్థాలను తొలగించకుండా, చనిపోయిన కోళ్లను గ్రామ సమీపంలో పడవేస్తుండడంతో ఈగలు ఎక్కువై ప్రజలు అంటురోగాలు, విషజ్వరాల బారిన పడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో కోళ్ల వ్యర్థాల నుంచి భరించలేని దుర్గంధం వస్తూ ఈగలు ఎక్కువగా పెరిగాయన్నారు. ప్రజారోగ్యంపై దెబ్బతీసే కోళ్లఫారాల యజమానులు తక్షణం ఈగలు రాకుండా స్ప్రే చేయాలన్నారు. ఒకవేళ ఈగలను అరికట్టకపోతే కోళ్లఫారాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం కోళ్ల ఫారాల యజమానికి నోటీసులు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, కార్యదర్శి రజని సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


బాహుదా ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బాహుదా ప్రాజెక్టు నిండే అవకాశం ఉందని నది పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ ఏఈ శ్రీహరిరెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీవో రమేశ్, స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు నిండేందుకు కేవలం ఐదడుగులు మాత్రమే ఉందని, ప్రజలు నదీ పరివాహక ప్రాంతాల్లో ఉండరాదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

డ్యూటీ రోస్టర్లు మార్చాలి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ జూనియర్ అసిస్టెంట్ల డ్యూటీ రోస్టర్లను ప్రతి మూడు నెలలకు మార్చాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి ముబారక్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో సూపరింటెండెంట్, ఆర్ఎంఓతో ఏఐటీయూసీ నేతలు, జూనియర్ అసిస్టెంట్లతో కలిసి చర్చలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏడాదిన్నరగా డ్యూటీ రోస్టర్లను మార్చకపోవడం, జూనియర్ అసిస్టెంట్లు సాయిప్రతాప్, లోకేశ్వర పాలన విషయంలో అజమాయిషీ చేస్తున్నారని ఆరోపించారు.

ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం కలిగించాలి

● ఆసుపత్రి అభివృద్ధి సంఘు సమావేశంలో మంత్రి మండిపల్లి

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సంఘ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఓపీ బాగా పెరిగిందని, రోజుకు 1000 మంది వైద్యం పొందడం సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా వసతులు కల్పిస్తామన్నారు. వైద్యుల సలహా మేరకు అవసరమైన పరికరాలను సమకూర్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలియజేశారు. క్రిటికల్ కేర్ ప్రారంభోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్లినట్లు తెలియజేశారు. ప్రజల్లో నమ్మకం కలిగేలా వైద్యం అందించి కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని వైద్యులకు సూచించారు. వైద్యం కోసం వచ్చిన వారిపై కొంతమంది వైద్యులు దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు తన దృష్టికి రావడంతో ఎస్పీతో చర్చించి ఇక్కడ ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డు విధుల్లో ఉండేట్లుగా చూస్తానని హామీ ఇచ్చారు. ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కోసం తమ వంతు సహకారం అందిస్తామని తెలియజేశారు. ఆసుపత్రిలో రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో రాయచోటి ఏరియా ఆసుపత్రి వైద్యులు డేవిడ్ సుకుమార్, డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రవి, కమిటీ సభ్యులు ఖాదర్‌బాషా, రాయదుర్గం లక్ష్మీదేవి, పలువురు వైద్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

హౌస్ బిల్డింగ్ సొసైటీకి ఎనిమిది నామినేషన్లు

● నేడు నామినేషన్ల పరిశీలన..24న ఉపసంహరణ

మదనపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలకు ఎనిమిది మంది నామినేషన్లు దాఖలు చేశారు. స్థానిక సొసైటీ కాలనీలోని సహకార శాఖ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికల అధికారి రాజశేఖర్‌రెడ్డి, సొసైటీ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌కుమార్‌లు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. ఇందులో బి.మహేష్‌కుమార్, ఎం.పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్.రెడ్డెప్ప, కె.వీరవెంకటశివాజీ, బి.శివానందనాయక్, కె.వెంకటాచలపతి, ఎస్.రెడ్డిషంషీర్, యు.నరేష్‌లు ఉన్నారు. ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలను సహకార శాఖ అధికారులు ప్రతిష్ఠాత్మంగా తీసుకుని అక్రమాలకు చెక్ పెట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. మొత్తం 239 మంది ఓటర్లు ఉండగా అయిదేళ్ల పదవీ కాలంతో జరిగే ఈ ఎన్నికల్లో ఏడుగురు పాలకవర్గ సభ్యులు ఉండగా, వీరి నుంచి ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకోనున్నారు. పోలీసు బందోబస్తు మధ్య నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాగా, గురువారం నామినేషన్ల పరిశీలన, 24న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అభ్యర్థులను ప్రకటించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఏడుగురు సభ్యులే ఉంటే ఏకగ్రీవంగా ఎన్నికైన అభ్యర్థులుగా ఎన్నికల అధికారి ప్రకటించనున్నారు. ఎనిమిది మంది పోటీలో ఉంటే తర్వాత అవసరాన్ని బట్టి 29న పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో రెండు వర్గాలు పోటీ పడతాయని అటు స్థానికులు, ఇటు అధికారులు భావించారు. అయితే అందుకు భిన్నంగా ఒక వర్గం అభ్యర్థులు మాత్రమే ఎన్నికలకు ఉత్సాహం చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. కార్యక్రమంలో సహకార శాఖాధికారులు బి.దుర్గమ్మ, ఆడిటర్ రెడ్డెప్ప, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె సర్వేయర్‌పై విచారణ

కలికిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె హంద్రీ-నీవా సుజల స్రవంతి యూనిట్-1లో స్పెషల్ సర్వేయర్‌గా పనిచేస్తున్న గుండ్రామి వెంకట్రమణపై విచారణ జరపాలని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. భారీగా అక్రమాస్తులు కూడబెట్టిన వ్యవహారంలో గతంలో ఏసీబీ నమోదు చేసి కేసుకు సంబంధించి ఆ శాఖ డైరెక్టర్ జనరల్ ఆగస్టు 22న ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను పరిశీలించిన అనంతరం సర్వేయర్‌పై విచారణ చేపట్టాలని నిర్ణయించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సర్వేయర్‌గా పనిచేస్తూ మదనపల్లెలో భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ చేసిన తనిఖీల్లో వెల్లడయ్యింది. ఆస్తుల కొనుగోలుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు పొందలేదని, లేదా ఆస్తులకు సంబంధించిన వార్షిక నివేదికలను ప్రభుత్వానికి తెలియబరచలేదని కూడా ఏసీబీ ఆరోపించింది. విచారణను కొనసాగించడానికి ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి బుధవారం అభియోగాలకు సంబంధించిన చార్జిషీటు జారీ చేశారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్ష


ముద్దాయి మహబూబ్‌బాషాను జైలుకు తరలిస్తున్న పోలీసులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతికి కారణమైన నిందితుడికి మదనపల్లె పీడీఎం కోర్టు ఏడాది జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే... మదనపల్లె మండలం ఆరోగ్యవరం వద్ద 2021 ఫిబ్రవరి 12 తేదీ ద్విచక్రవాహనంలో వెళుతున్న శ్రీహరి, తరుణ్‌కుమార్, ధనుష్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మిత్రులు అక్కడికక్కడే మృతి చెందారు. మదనపల్లె తాలూకా ఏఎ్‌సఐ సుబ్రమణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు మదనపల్లె పీడీఎం కోర్టుకు విచారణ రాగా కేసు పూర్వాపరాలు విచారించిన న్యాయాధికారి సుభాన్ తీర్పు ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతికి కారణమైన రాయచోటికి చెందిన లారీ డ్రైవర్ మహబూబ్‌బాషాకు ఏడాది జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధించారు.

స్త్రీనిధి దుర్వినియోగంపై విచారణ



సంఘమిత్ర స్వాతి, మహిళా సమాఖ్య అధికారులను విచారిస్తున్న సీఐ కళా వెంకటరమణ

మదనపల్లె టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మహిళా సమాఖ్య పరిధిలోని రేగంటివారిపల్లె 30 ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యుల స్త్రీనిధి డబ్బు దుర్వినియోగంపై పోలీసులు విచారణ చేస్తున్నారు. బుధవారం స్థానిక తాలూకా పోలీసుస్టేషన్‌లో సీఐ కళా వెంకటరమణ ఆధ్వర్యంలో ఏపీఎం ఖిజర్‌అహ్మద్ సమక్షంలో రేగంటివారిపల్లె సంఘమిత్ర స్వాతిని విచారించారు. 30 గ్రూపు సభ్యుల రూ.36 లక్షల స్త్రీ నిధి డబ్బు జమ చేయకపోవడంతో బ్యాంకు అధికారులు సంఘ సభ్యులకు నోటీసులు ఇచ్చారు. దీంతో ఆందోళన చెందిన మహిళా సభ్యులు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సీఐ సంఘమిత్ర స్వాతిని పిలిచి విచారించారు. సంఘసభ్యులు చెల్లించిన డబ్బుకు రసీదులు ఉన్నాయా అని ప్రశ్నించారు. డబ్బు దుర్వినియోగంపై మూడు రోజుల్లో విచారించి బాధితులకు న్యాయం చేస్తామని ఏపీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్, ఏసీ సాంబశివ, సీసీలు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేయాలి


మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ శివరామ్

మదనపల్లె టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మార్కెట్‌కు వచ్చే టమోటా రైతుల శ్రేయస్సే ధ్యేయంగా మార్కెట్ కమిటీ సభ్యులు పనిచేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులోని సమావేశ మందిరంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్ అధ్యక్షతన ట్రేడర్లు, వ్యాపారులు, రైతులతో సమావేశమైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్‌లో జాక్‌పాట్ విధానం రద్దు చేయాలని, కమీషన్ విషయంలో నిబంధనలు పాటించాలన్నారు. మార్కెట్‌లో వేలం టైమింగ్ మార్పు, 25 కిలోల క్రేట్ల బదులు, చిన్న క్రేట్ల వినియోగంపై చర్యలు చేపట్టాలన్నారు. దేశంలో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న మదనపల్లె మార్కెట్‌కు పూర్వవైభవం తీసుకురావాలన్నారు. చైర్మన్ శివరామ్ మాట్లాడుతూ మధ్యాహ్నం పూట వేలం నిర్వహిస్తే టమోటాకు ధరలు వస్తాయని తెలుస్తోందన్నారు. వ్యాపారులు, రైతులు నష్టపోకుండా నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ ఆంజనేయులు, డైరెక్టర్లు సి.నరసింహులు, జిలానినూరున్నిసా, డ్యాన్స్ రెడ్డెప్ప, మున్నానాయక్, లక్ష్మీపతి, శ్యామల, కార్యదర్శి జగదీష్, సహాయ కార్యదర్శి అభిలాష్, రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించండి


పూలతోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి సుభాషిణి

మదనపల్లె టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వరుస వర్షాలతో దెబ్బతిన్న ఉద్యానపంటలను కాపాడుకోవడంలో రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి తెలిపారు. బుధవారం మదనపల్లె మండలం సీటీఎం కొత్తవారిపల్లె గ్రామాల వద్ద ఉద్యానపంటలను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ టమోటా పంట సాళ్లలో నిలిచిన వర్షపు నీటిని దిగువ ప్రాంతాల్లోకి పారేలా రైతులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షం ఆగిన వెంటనే 5 లీటర్ల నీటికి 19-19-19 కలిపి సూక్ష్మపోషకాలతో నీటి మిశ్రమాన్ని పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మదనపల్లె ఉద్యాన శాఖ అధికారి ఈశ్వరప్రసాద్‌రెడ్డి, వీఏఓలు, పాల్గొన్నారు.

ఉపాధి హామీ అంబుడ్స్ పర్సన్‌గా శ్రీరాములు

కలికిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలును పర్యవేక్షిస్తూ సమస్యలను, ఫిర్యాదులపై విచారణ జరిపి పరిష్కార మార్గాలు సూచించడం కోసం జిల్లా అంబుడ్స్ పర్సన్‌గా కె.శ్రీరాములును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. కూలీలు, ఇతర వర్గాల నుంచి అందే ఫిర్యాదులను అంబుడ్స్ పర్సన్ పరిష్కరించి చర్యల కోసం ప్రభుత్వానికి నివేదించాల్సి ఉంది. జిల్లాలో ఉపాధి హామీలో జరిగే అక్రమాల గురించి ప్రతి మూడు నెలలకూ ప్రభుత్వానికి నివేదికలు అందజేయాల్సి వుంది. అంబుడ్స్ పర్సన్ నియామకం, విధులు, బాధ్యతలకు సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'పండని' తమలపాకులు


రాంసాయినగర్‌లో సాగు చేసిన తమలపాకు తోట

- మూడేళ్లుగా కనిపించని లాభాలు
- సాగుకు వెనుకాడుతున్న రైతులు

దువ్వూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు తమలపాకును లక్ష్మితో సమానంగా చూస్తారు. తమలపాకు తోట ఉంటే లాభాలు వెంట ఉన్నట్లేనని భావిస్తారు. ఇది మునుపటి పరిస్థితి. ఈ తోటలు సాగు చేసిన రైతులు లాభాలమాట అటుంచి నష్టాలు మూటకట్టుకోకపోతే చాలు అనే అభిప్రాయంలో ప్రస్తుతం ఉన్నారు. అయితే ఎప్పుడో ఒకసారి ధరలు పండకపోతాయా, లాభాలను ఆర్జించలేక పోతామా అనే ఆశతో ముందుకు సాగుతున్నారు.

దువ్వూరు మండలంలో ఒకప్పుడు 150 ఎకరాల దాకా తమలపాకు తోటలు ఉండేవి. ఆ విస్తీర్ణం బాగా తగ్గి నేడు 70 ఎకరాలకు వచ్చింది. ఈ పంట సాగులో లాభాలు రాకపోవడమే కారణమని రైతులు వాపోతున్నారు. మండల పరిధిలో దువ్వూరు, రాంసాయినగర్, మూడిండ్లపల్లె, ఇడమడక, క్రిష్ణంపల్లె ప్రాంతాల్లో ఈ తమలపాకు తోటలు సాగు చేసేవారు. అయితే గిట్టుబాటు ధరలు లేకపోవడంతో సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. మునుపు ధరలు ఆశాజనకంగా ఉండేవి. 60 కట్టలు (సట్టలు) కలిగిన బుట్ట ధర రూ.3వేలకు పైగా ధర ఉండేది. ప్రస్తుతం అదే బుట్ట రూ.700 నుండి రూ.1000కి పడిపోయి మూడేళ్లుగా ఆటుపోట్ల మధ్య కొనసాగుతోందని రైతులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. మునుపు చెన్నై, హైదరాబాదు, నిజమాబాదు, బెల్గాం, కొల్హాపూర్, ముంబై, సోలాపూర్ ప్రాంతాలకు తమలపాకులు ఎగుమతి చేసేవారు. మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో ప్రస్తుతం చెన్నై, హైదరాబాదుకు మాత్రమే ఇక్కడి నుంచి ఎగుమతి చేస్తున్నారు.

భారీగా పెట్టుబడి వస్తోంది..



తమలపాకు తోటలు సాగు చేయాలంటే పెట్టుబడులు భారీగా అవుతున్నాయి. ఎకరాలో ఈ పంట వేస్తే దిగుబడి అందే సమయానికి రూ.3లక్షలు ఖర్చు అవుతోంది. రాంసాయినగర్, మూడిండ్లపల్లె, నాగసానిపల్లె గ్రామాల్లో నేను తమలపాకు తోటలు సాగు చేశాను. లాభాలు కనిపించక మూడేళ్లు అవుతోంది. చాలా మంది వీటి సాగుకు వెనుకడుగువేస్తున్నారు. ఆశకొద్దీ కొందరం తోటలు కోస్తున్నాం. పరిస్థితి ఇలాగే కొనసాగితే తమలపాకు సాగుకు చరమగీతం పాడుతాం.

\- ఎన్.వెంకటేశ్వరరెడ్డి, రైతు, పెద్దజొన్నవరం

ఘనంగా ఆకాశ దీపోత్సవం


ఆకాశ దీపాన్ని లాగుతున్న ఈఓ కృష్ణానాయక్, రాజారెడ్డి

పెండ్లిమర్రి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన పొలతల మల్లికార్జునుడి దేవస్థానంలో బుధవారం ఆకాశ దీపోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఈఓ కృష్ణానాయక్ మాట్లాడుతూ కార్తీక మాస ఉత్సవాలను పురష్కరించుకుని భక్తుల సౌకర్యార్థం వృద్ధులు, వికలాంగులు, చిన్నపిల్లల తల్లులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందుగానే ఉచిత ప్రసాదం, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ క్రీడా పురస్కారాల కోసం దరఖాస్తులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, క్రీడా విభాగం ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి జాతీయ క్రీడా పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జున అవార్డు, అర్జున (లైఫ్ టైం అవార్డు), మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు, ద్రోణాచార్య అవార్డు, ద్రోణాచార్య (లైఫ్ టైమ్ అవార్డు), రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహక పురస్కార్‌లకు అర్హత కలిగిన క్రీడాకారులు, కోచ్‌లు సంస్థలు www.dbtyas-sports.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 28వ తేదీ రాత్రి 11.59 గంటల వరకు పంపుకోవచ్చని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు, కోచ్‌లు, సంఘాలకు సంబంధించిన వివరాలపై పోర్టల్‌లో లభ్యమయ్యే మార్గదర్శకాలు పరిశీలించి, గడువులోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలియజేశారు.

ఎస్‌జీఎఫ్ డివిజనల్ స్థాయి ఎంపికలు


డివిజనల్ స్థాయి యోగా విజేతలు

పులివెందుల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (రమణప్ప)లో బుధవారం ఎస్‌జీఎఫ్ డివిజనల్ స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా బుధవారం యోగా, చెస్, వాలీబాల్, సెటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారిని ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ డివిజనల్ కోఆర్డినేటర్ ఫ్రాన్సిస్ రవికుమార్, జిల్లా కార్యదర్శి విక్టర్ ఇమ్మానియేల్, ఆర్గనైజర్స్ జీవనీ కేల్కర్, టి.ప్రభాకర్, గోవర్ధన్‌రెడ్డిలు తెలిపారు.

హామీలను అమలు చేయాలి

వేంపల్లె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పింఛనర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికారప్రతినిధి తులసిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారానికి కృషి చేస్తాం, మెరుగైన పీఆర్సీ అమలు చేస్తాం, అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్ ప్రకటిస్తాం, రావాల్సిన బకాయిలు చెల్లించే ఏర్పాటు చేస్తాం తదితర హామీలు ఇచ్చారన్నారు. ఉద్యోగస్తులు, ఉపాధ్యాయులు, పింఛనర్ల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం మాట తప్పిందన్నారు. అలాగే చంద్రబాబుపాలనలో రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అనారోగ్యశ్రీ అయిందని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు.

క్లబ్బులపై డీఎస్పీ బృందం దాడి


క్లబ్బులో వార్నింగ్ ఇస్తున్న డీఎస్పీ మురళినాయక్

పులివెందుల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని రెండు క్లబ్బులపై డీఎస్పీ మురళినాయక్ బృందం దాడులు నిర్వహించింది. బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని లయన్స్ క్లబ్, లిటరరీ క్లబ్‌లపై దాడులు నిర్వహించారు. గతంలో ఈ రెండు క్లబ్బులలో ఎలాంటి గ్యాంబ్లింగ్ ఆడవద్దని డీఎస్పీ ఆదేశించారు. అప్పటి నుంచి గ్యాంబ్లింగ్ జరగలేదు. కానీ గత రెండు మూడు రోజులుగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో డీఎస్పీ, అర్బన్ సీఐ సీతారామిరెడ్డి, ట్రాఫిక్ సీఐ హాజీవలి, వేముల ఎస్ఐ ప్రవీణ్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అక్కడున్న వారికి డీఎస్పీ వార్నింగ్ ఇచ్చారు. గ్యాంబ్లింగ్ వంటి కార్యక్రమాలు చేపడితే కేసు నమోదు చేసి కోర్టుకు పంపిస్తామని హెచ్చరించారు.

నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ

- మున్సిపల్ వర్కులపై నివేదిక ఇవ్వాలని లేఖ
- వర్కుల జాబితా సిద్ధం చేసి పంపిన మున్సిపల్ అధికారులు



ప్రొద్దుటూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సి పాలిటీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ కడప రీజనల్ అధికారులు దృష్టి సారించారు. ఆమేరకు 2019 జూన్ నుం చి 2024 మే వరకు మున్సిపా లిటీలో జరిగిన వర్కులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌కు అక్టోబరు 9వ తేదీ విజిలెన్స్ అధికారులు లేఖ పంపారు. అందులో అక్టోబరు 16 లోపల బేసిక్ డేటా ప్రొఫార్మ-ఏ, ప్రొఫార్మ 501, 501 ఏ, 501బీలలో రూపొందించిన విధంగా సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే బిల్లులకు సంబంధించి పేమెంట్స్ ఎంత మేర జరిగాయో తెలపాలన్నారు. ప్రోగస్ ఆఫ్ వర్క్, చెక్‌మెజర్‌మెంట్ స్టేట్ మెంట్ తదితరాలు సమర్పించాలని కోరారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 1100 వర్కులు జరిగాయి. ఇందులో టెండర్ నిబంధనల ఉల్లంఘనలు వున్నాయి. ముఖ్యంగా ఒకే వర్కును నాలుగు భాగాలుగా విభజించి రూ.40లక్షల లోపు పనులు చేశారని ఆరోపణలున్నాయి. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 15 ఫైనాన్స్ గ్రాంట్ వర్కులను జనరల్ ఫండ్ కింద పనులు చేసి, నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగాలున్నాయి. జనరల్ ఫండ్ వాడు కోవాల్సిన లిమిట్స్ కంటే అధికంగా దుర్వినియోగం చేసి.. దాదాపు రూ.70కోట్ల మేర ఖర్చు చేశారని ఆరోపణలున్నాయి. సింగ ల్ టెండర్లు ఎక్సెస్ రేట్లకు టెండర్లు వేసినవి కూడా టెండర్ నిబంధనలు ఉల్లంఘించి చేసినవి వున్నట్లు ఆరోపణలున్నాయి. గత ఏడాది నవంబరులో మున్సిపల్ ఆర్‌డీ నేతృత్వంలో దాదా పు నెల రోజులపాటు నాలుగు జిల్లాల అధికారులు ప్రత్యేక టీంలుగా వచ్చి విచారణ చేపట్టారు. కానీ ఆ విచారణ నివేదిక ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వానికి అందజేసినా నేటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నేడు మళ్లీ విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వైసీపీ హయాంలో మున్సిపాలిటీలో జరిగిన పనులపై విచారణ చేపట్టనున్నారు. దీంతో ఏడాదికి పైగా వైసీపీ అక్రమాలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన జరగుతూనే వుందనే ఆరోపణలున్నాయి.

అప్పుల బాధతో రైతు మృతి


నాయుడు బాబు (ఫైల్)

పోరుమామిళ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక కల్వకూరి నాయుడు బాబు (35) అనే రైతు విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధి కమ్మవారిపల్లె సమీపంలోని చెంచు కాలనీకి చెందిన నాయుడు బాబు ఐదేళ్లక్రితం తనకున్న ఎకరా పొలంతో పాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పసుపు, పత్తి పంటలు సాగు చేశాడు. సక్రమంగా పండకపోవడంతో నష్టాన్ని చవిచూశాడు. దీంతో పంటల సాగుకోసం చేసిన అప్పులు ఐదేళ్లకు రెట్టింపు కావడంతో వ్యవసాయం వదిలి కూల్‌డ్రింక్ షాపు నిర్వహించాడు. అందులో కూడా నష్టాలు రావడంతో ఈనెల 18న విషద్రావణం తాగాడు. కుటుంబ సభ్యులు పోరుమమిళ్లలోని ఆసుపత్రికి.. అక్కడి నుంచి నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ విషయాన్ని మృతుని తల్లి కలవకూరి లక్షుమ్మ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మృతుడికి భార్య సురేఖ, కుమార్తెలు వెంకటపూజిత, మౌనిత ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

విద్యుత్ షాక్‌తో పందులు మృతి


మృతి చెందిన పందులు

వల్లూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం వల్లూరులోని సంపద తయారీ కేంద్రం వద్ద విద్యుత్‌షాక్‌తో మూడు పందులు మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. గత రాత్రి కురిసిన వర్షానికి వల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి, సచివాలయంలోకి వెళ్లే ప్రధాన రహదారిలో సంపద తయారీ కేంద్రం వద్ద విద్యుత్ తీగలు కిందకు వంగి రేకులకు తగిలాయి. ఆ రేకులు కాస్త ఇనుప గేటుకు అనుసంధానమై ఉండటంతో విద్యుత్ ప్రసరించి పందులు తగలగానే షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాయి. ఓ పక్క వర్షం కురుస్తుండడంతో అక్కడ ఎవరూ లేకపో వడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం గమనించిన స్థానికులు విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించగా వారు విద్యుత్ వైర్లను కట్ చేసి ప్రమాదాన్ని తప్పించారు. దీంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్లకు గాయాలు

సీకేదిన్నె, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయచోటి రోడ్డులోని కొత్తరోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు, లారీ డ్రైవర్లు శ్రీనాథ్, యేసుదాసులకు స్వల్ప గాయాలయ్యాయి. రాయచోటి వైపు నుంచి కడపకు వస్తున్న మారుతీ కారు కొత్త రోడ్డు వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తూ కడప నుంచి డంపింగ్‌యార్డుకు చెత్తను తరలిస్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందుభాగం దెబ్బతింది. అదే సమయంలో కారులోని హెయిర్‌బెలూన్ తెరచుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గాయాలతో బయటపడిన డ్రైవర్లను హైవే పెట్రోలింగ్ పోలీసులు 108లో రిమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఘటనపై సీకేదిన్నె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జమ్మలమడుగులో వ్యక్తికి...

జమ్మలమడుగు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ఎస్‌ఆర్ పెట్రోలు బంకు సమీపాన మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. జమ్మలమడుగు మెప్మా కార్యాలయంలో పనిచేస్తున్న రమణారెడ్డి అనే ఉద్యోగి జమ్మలమడుగు నుంచి రాత్రి ప్రొద్దుటూరుకు ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. ఎదురుగా వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో రమణారెడ్డికి తలకు, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి... అక్కడి నుంచి హైదరాబాదు యశోధ ఆస్పత్రికి రెఫర్ చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు జమ్మలమడుగు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు అదృశ్యం


కేతనగిరి వెన్నెల

మైదుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పట్టణం కొత్త కొట్టాలకు చెందిన కేతనగిరి వెన్నెల ఈనెల 20వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగిరానట్లు ఆమె కుమారుడు వెంకటరమణ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సదరు మహిళ విషద్రావణం తాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడుతున్నట్లు సామా జిక మాధ్య మాలలో ఒక వీడియో ప్రసారం అవుతోంది. అయితే ఆమె కాదా అని పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.


భూమిరెడ్డి ఇస్రాయిల్

మున్సిపాలిటీ పరిధి బద్వేలు రోడ్డులోని మహబూబ్ నగర్‌కు చెందిన భూమిరెడ్డి ఇస్రాయిల్ (35) ఈ నెల 3వ తేదీ అదృశ్యమయ్యాడు. ఇస్రాయిల్ కర్ణాటకు రాష్ట్రం బళ్లారికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో అతని భార్య భూమిరెడ్డి స్వప్న మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వీరి ఆచూకీ తెలిస్తే 9121100618, 9121100619 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు.

పేదల బియ్యం అక్రమ రవాణాకు చెక్



తనిఖీలకు ఉపయోగించే కిట్

కడప కలెక్టరేట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆహార భద్రతలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కిచ్చే సబ్సిడీ బియ్యం అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. దొంగెవరో.. దొరెవరో అర్థం కానీ పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో అయితే ఇంటింటికి బియ్యం పంపిణీకి ఎండీ యూ వాహనాలకు లైసెన్స్ ఉండడంతో బియ్యం అక్రమ రవాణాకు ఆన వాళ్లు దొరకేవి కావు. ఇలాంటి పరిస్థితులను కట్టడి చేసేందుకు కూటమి సర్కారు నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. పేదల బియ్యం అనే విష యాన్ని గుర్తించేందుకు వీలుగా.. ఏసీబీ దాడుల్లో అవినీతి సొమ్ము ఎలా అయితే కెమికల్స్ ద్వారా గుర్తిస్తారో అదే తరహాలో అక్రమంగా తరలించే బియ్యాన్ని గుర్తించేందుకు ద్రావకంతో కూడిన కిట్లను జిల్లాల వారీగా సరఫరా చేశారు. ప్రభుత్వం పోషక విలువలతో రూపొందిం చిన ఫోర్టిఫైడ్ బియ్యంను ఈ కెమికల్స్‌తో పరీక్షల ద్వారా నిర్ధారించే అవకాశం ఉంది. దీంతో ఇన్నాళ్లు సాధారణ బియ్యం మాటున అక్రమంగా తరలిపోతున్న పేదల బియ్యం కట్టడికి రెడ్ సిగ్నల్ పడనుంది. బుధవారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురామ్ జిల్లాకు 9 కిట్లు రాగా అందులో నియోజకవర్గానికి ఒక కిట్ చొప్పున ఎన్‌ఫోర్సుమెంట్ డిప్యూటీ తహశీల్దార్లకు పంపిణీ చేశారు. మిగతా రెండు కిట్లను ఏఎస్‌వోలకు అందజేశారు.

ఇది...శ్మశాన వాటికే..!

- శవాలను పూడ్చలేని దుస్థితి
- ఏళ్ల తరబడి సాగుతున్న సమస్య
- పరిష్కారం చూపని అధికారులు, ప్రజాప్రతినిధులు


కంపచెట్లు, జంబుతో సమాధులు సైతం కనిపించని అలాంఖాన్‌పల్లె శ్మశానవాటిక


శ్మశానవాటిక చుట్టూ ఉన్న మురుగునీరు

కడప మారుతీనగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అది పేరుకే శ్మశానవాటిక. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే అక్కడ శవాలను పూడ్చలేని దుస్థితి. సాధారణంగా శ్మశాన వాటికలో ఎవరైనా మృతి చెందితే వారికి సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. అయితే ఇక్కడ ఆ పరిస్థితి లేదు. శ్మశానవాటిక చుట్టూ మురుగునీరు, కంపచెట్లు, ఏపుగా పెరిగిపోయిన జమ్ముతో నిండి.. కనీసం శ్మశానవాటికలోని సమాధులు సైతం కనిపించని పరిస్థితి. ఇక గ్రామంలో ఎవరైనా మృతి చెందితే.. శవాన్ని శ్మశానవాటికలోకి తీసుకెళ్లాలంటే నరకయాతనే. ఈ దుస్థితి ఎక్కడో మారుమూల గ్రామంలో అనుకుంటే పొరపాటే. కడప నగరానికి అత్యంత సమీపంలోని ఆలంఖాన్‌పల్లె శ్మశానవాటికలో నెలకొంది.

కడప నగరం 49వ డివిజన్ పరిధిలోని ఆలంఖాన్‌పల్లెలో దాదాపు వేల మంది జనాభా ఉన్నారు. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా శ్మశానవాటికలో సౌకర్యాలు కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని గ్రామ ప్రజలు ఏళ్ల తరబడి మొరపెట్టుకుంటున్నా పట్టించుకునేవారే లేరని వాపోతున్నారు. ఇటీవల శ్మశానంలో శవాన్ని పూడ్చే పరిస్థితి లేకపోవడంతో కడప-కర్నూలు రహదారిపై రాస్తారోకో చేపట్టి ఆందోళన చేశారు. దీంతో అధికారులు అక్కడకు వచ్చి సమస్యను పరిష్కరిస్తామని నచ్చజెప్పి... ఆ తర్వాత షరా మామూలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు దృష్టి సారించి శ్మశానవాటిక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షం నీటితో చెరువుల్లో జలకళ

మొరవపోతున్న గుమ్మసముద్రం - అప్రమత్తమైన అధికార గణం ● చెరువునీరు కాల్వపై పడకుండా జాగ్రత్తలు

జోరుగా ప్రవహిస్తున్న పింఛానది ● అప్రమత్తంగా ఉండండి : మదనపల్లె డీఎస్పీ మహేంద్ర



మొరవనీరు పక్కకు పోకుండా మట్టికట్ట వేస్తున్న దృశ్యం

బి.కొత్తకోట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో జనజీవనం స్తంభించింది. కాగా చెరువుల్లో నీరు చేరి మొరవ పోతున్నాయి. చెరువులు, నీటగి కుంటలు నీటితో కళకళలాడుతుంటే హంద్రీ- నీవా అధికారుల్లో ఒకింత టెన్షన్ నెలకొంది. నీటి ఒరవడి పెరుగుతున్నకొద్దీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రకటిస్తున్నారు. వివరాల్లోకెళితే...

బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం చెరువు కురుస్తున్న వర్షాలతో నిండి మొరవపోతోంది.



హంద్రీ-నీవా కాల్వపై నిర్మించిన అక్విడెక్ట్‌లో వెళుతున్న మొరవనీరు

ది. చెరువు కట్టమీదుగా బి.కొత్తకోట- మదనపల్లి రోడ్డు వుండటం, బి.కొత్తకోటకు సమీపంలో వుండడంతో మొరవనీటిని, చుట్టూ కొండల లోకేషన్‌ను చూసేందుకు జనం భారీ ఎత్తున తరలి వస్తున్నారు. భారీ వర్షాలతో మొరవ ప్రవాహం పెరిగి ఆ చెరువు దిగువనే ప్రవహిస్తున్న హంద్రీ-నీవా పుంగనూరు బ్రాంచి కెనాల్‌పై ఎక్కడ పడుతుందోనన్న ఆందోళన అధికారుల్లో నెలకొంది. ముందుజాగ్రత్తగా ఎడమ వైపు మొరవ నుంచి నీరు బయటికి రాకుండా ఇసుకబస్తాలతో అడ్డుకట్ట వేశారు. హిటాచితో నిర్మాణాన్ని కట్‌చేసి కుడిమొరవ ఎత్తు తగ్గించారు. అయినా కాల్వ మీదుగా నిర్మించిన అక్విడెక్ట్ నుంచి మెరవనీరు వెళుతుండడంతో బుధవారం మరిన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. కాల్వ వైపు వెళ్లకుండా మట్టికట్ట వేశారు. చెరువు ఆనకట్ట క్రిందిభాగంలో నిల్వ వున్న ఊరిన నీటి కారణంగా హంద్రీ-నీవా కాల్వ గట్టులో పగుళ్లు ఏర్పడ్డాయి. ఇప్పుడు చెరువునిండు కుండలా వుండడంతో ఈ గట్టు భద్రత ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ఆయిల్ ఇంజను సాయంతో కట్టకింది నీటిని తోడి కాల్వలోకి వదులుతున్నారు. మొరవ పక్కనే కొంత స్థలాన్ని చదును చేసి సిద్ధం చేశారు. అవాంఛిత సంఘటనలు జరగకుండా గట్టి నిఘా పెట్టారు. గుమ్మసముద్రం చెరువు నిండిన కారణంగా ఎగువ భాగంలోని చెరువు మునగడ భూమిలో సాగుచేసిన మెక్కజొన్న, వరి నీటిలో మునిగిపోయాయని కొండకింద పల్లి, బుచ్చిరెడ్డిపల్లి రైతులు వాపోతున్నారు.

జోరుగా పింఛా నది

పీలేరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పీలేరు, కేవీపల్లె మండలాల్లోని పలు చెరువులు మొరవలు పోతున్నారు. పట్టణ సమీపంలో వెళుతున్న పింఛా నది జోరుగా ప్రవహిస్తోంది. అగ్రహారం, అయ్యవు నాయుని చెరువులు నిండు కుండలా కళకళ లాడుతున్నాయి. కేవీ



ఉధృతంగా ప్రవహిస్తున్న పింఛా నది

పల్లె మండలం గర్నిమిట్ట చెరువు జోరుగా మొరవ పోతోంది. ఇరు మండలాల్లో వాగులు, వంకలు, కుంటలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జోరుగా వర్షాలు పడుతున్నా, పింఛా నది ఉధృతంగా ప్రవహిస్తున్నా ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో కొన్ని చెరువుల్లోకి నీరు చేరక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అప్రమత్తంగా ఉండండి

మదనపల్లె డీఎస్పీ మహేంద్ర

ములకలచెరువు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర హెచ్చరించారు. మద్దినాయనిపల్లె సమీపంలో రోడ్డుపై మొరవపోతున్న పెద్ద చెరువును బుధవారం పరిశీలించిన ఆయన



మద్దినాయనిపల్లె చెరువును పరిశీలిస్తున్న డీఎస్పీ మహేంద్ర

మాట్లాడుతూ మొరవనీరు రోడ్డు మీదుగా వెళ్తుండడంతో వాహనదారులు జాగ్రత్తగా రాకపోకలు సాగించాలన్నారు. చెరువులు, కుంటల వద్దకు ప్రజలు వెళ్లరాదన్నారు. కార్యక్రమంలో సీఐ వెంటేషులు, ఎస్ఐ నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

మొరవలు పోతున్న చెరువులు

కలకడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు చెరువులు మొరవలు పోతున్నాయి. మండలంలో 118 మైనర్ ఇరిగేషన్ చెరువులుండగా 15 పూర్తిగా నిండాయి. మిగిలిన వాటిలో చెప్పుకో



చెరువులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, అధికారులు

దగ్గ స్థాయిలో నీరు చేరాయి. నవాబ్‌పేట, కదిరాయచెరువు, ఎనుగొండపాలెం చెరువులు, మొరవలను ఎంపీడీఓ భానుప్రసాద్, ఇరిగేషన్ ఏఈ స్వర్ణలత పరిశీలించి పరిస్థితి సమీక్షించారు. అనంతరం ఎంపీడీఓ ఎనుగొండపాలెం, ముడియంవారిపల్లి సచివాలయలను తనిఖీ చేసి ప్రజలకు అందుబాటులో వుండి వర్షాలకు అప్రమత్తం చేయాలని సూచించారు. పీఆర్ ఏఈ ప్రణయ్, కార్యదర్శులు పాల్గొన్నారు

ముందస్తు చర్యలు తీసుకోండి

తంబళ్లపల్లె, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల యంత్రాంగం అప్రమత్తంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ బాపూజీ పట్నాయక్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్, పీఆర్, సచివాలయ సిబ్బంది, తదితర శాఖలతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న పెద్దేరు, చిన్నేరు, దబ్బలగుట్ట జలాశయాలు, పలు చెరువులు పొంగి పొర్లుతున్నందున ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షిస్తూ పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రోడ్లపై వరద నీరు ప్రవహించే ప్రాంతాల్లో ప్రజల రాకపోకలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని, వరద ప్రవాహం ఉన్న రోడ్లను దాటొద్దని, చెరువులు, బావుల్లో ఈతకు దిగవద్దని సూచించారు. శిథిలావస్థలో, పాడుబడిన ఇళ్లలో నివాసం ఉన్న వారిని గుర్తించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ థామస్ రాజ, హౌసింగ్ ఏఈ సుజాత, డిప్యూటీ ఎంపీడీఓ ఈశ్వర్‌రెడ్డి, పీఆర్ ఏఈ వెంకట్రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

వరదలు వస్తే సమాచారం ఇవ్వండి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపధ్యంలో ఎక్కడైనా వరదలు స్తంభవిస్తే, ప్రాణాపాయ స్థితిలో ఉంటే వెంటనే అగ్రిమాపక కేంద్రం 101కు సమాచారం ఇవ్వాలని మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప తెలిపారు. బుధవారం ఆయన మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలో ఎగున ఉన్న చెరువుల్లో వర్షపు నీరు పెరుగుతోందని, దీంతో మొరవలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఎక్కడైనా చెరువులు తెగి, వరదలు వస్తే వెంటనే రెస్క్యూ టీంకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెరువుల పరిస్థితి తెలుసుకోండి



పెద్దమండ్యం పాతచెరువు, బ్రాహ్మణ చెరువుల్లో జలకళ

పెద్దమండ్యం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) రెండు రోజులుగా తుఫాన్ వర్షంతో వర్షపునీటి ఉధృతికి ప్రమాదంలో వున్న రోడ్లు, చెరువుల పరిస్థితి తెలుసుకోవాలని తహసీల్దార్ తేజస్వి అన్నారు. తహసీల్దార్ కార్యాయలంలో రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతూ వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వర్షపునీటి ఉధృతికి ప్రమాద స్థాయిలో వున్న రోడ్లు, చెరువుల పరిస్థితి తెలుసుకోవాలన్నారు. పెద్దమండ్యం - గుర్రంకొండ రహదారిలో కుషావతినది ప్రవాహంతో ప్రజల రాకపోకలకు ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పంట నష్టం అంచనా వేయాలన్నారు. అనంతరం కుషావతి నది పరివాహక ప్రాంతంలో రెవెన్యూ అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ తేజశ్వి, ఎస్ఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

తుఫాను ప్రభావం ఉంది..



కొత్తూరు చెరువు మొరవలో ఈత కొడుతున్న పిల్లలను మందలిస్తున్న సీఐ, ఎస్ఐలు

రామసముద్రం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో చెరువులు, కుంటలు నిండి మొరవలు పోతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ ఎంపీడీఓ గఫూర్, సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు. మండలానికి విచ్చేసిన సీఐ కురుస్తున్న వర్షాల గురించి ఎస్ఐ రమేష్‌బాబు ద్వారా వివరాలు తెలుసుకున్నారు. ఎలవానెల్లూరులో మొరవ పోతున్న కొత్త చెరువును సీఐ, ఎస్ఐలు పరిశీలించారు. చెరువు మొరవలో ఈత కొడుతున్న పిల్లలను మందలించి పిల్లలు చెరువుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అరికెల మానే వారిపల్లె పంచాయతీలో డిప్యూటీ ఎంపీడీఓ పర్యటించారు. నిండిన చెరువులను పరిశీలించి చెరువులకు గండ్లు పడే ప్రమాదాలు ఉన్నందున పంచాయతీ సెక్రటరీలు అప్రమతంగా ఉండాలని సూచించారు.

విద్యార్థులకు ఆత్మవిశ్వాసం ముఖ్యం



అవగాహన కల్పిస్తున్న ఛాయేంద్రకుమార్

కలకడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు ఆత్మవిశ్వాసాన్ని కలిగి వుండడం ముఖ్యమని సమగ్రశిక్ష పీఎంయూ కో ఆర్డినేటర్ డాక్టర్ ఛాయేంద్రకుమార్ అన్నారు. బుధవారం కేజీబీవీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు ఒత్తిడికి లోను కాకుండా లక్ష్యం వైపు అడుగు వేయాలన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా భయాందోళన చెందకుండా మనో నిబ్బరాన్ని కోల్పోవద్దని సూచించారు. మంచి భవిష్యత్తు, కలల సాకారం దిశగా ఉన్నత ఆశయం నేరవేర్చుకోవచ్చని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జీసీడీఓ సుమతి, ఎస్. అయేషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువు కట్టలను పటిష్టం చేయండి

మదనపల్లె టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జలవనరులశాఖ చెరువు కట్టలను పటిష్టం చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. బుధవారం చీకలబైలు పంచాయతీలోని కదిరమ్మచెరువుకు గండిపడే అవకాశాలు వున్నాయని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగడంతో ఎమ్మెల్యే హుటాహుటిన జలవనరులశాఖ ఏఈ రాజేంద్రబాబుతో కలిసి చెరువుకట్టను పరిశీలించారు. కట్ట చివరన కొంత భాగం మట్టికుంగడంతో ఆ ప్రాంతంలో ట్రాక్టర్లతో మట్టిని తోలించి, ఇసుక బస్తాలతో భర్తీ చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు పెద్దచెరువులు 50శాతం నీటితో నిండాయని, మిగిలిన చిన్న చెరువులు రెండు రోజుల్లో మొరవపోతాయన్నారు. చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్, టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

కులాల మధ్య చిచ్చుపెట్టేందుకే వైసీపీ కుట్రలు

మదనపల్లె టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కులాల మధ్య చిచ్చుపెట్టడానికే వైసీపీ నేతలు కుట్ర పన్నుతున్నారని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్, జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు ఆరోపించారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కందుకూరులో ఆర్థిక లావాదేవీలతో ఇద్దరు స్నేహితులు ఘర్షణపడడం, ఒకరు మరొకరిని హత్య చేయడాన్ని వైసీపీ అధిష్టానం రాజకీయ రంగు పులిమి ప్రజలను డైవర్ట్ చేయాలని చూస్తున్నారన్నారు. ఈ సంఘటనను భూతద్దంలో చూపిస్తూ కమ్మ, కాపు కులాల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అన్వర్‌బాషా, రమణ, నరసింహారెడ్డి, రాజన్న, రామచంద్ర, విద్యాసాగర్, శివకృష్ణ, గంగాధర్, వంశీ పాల్గొన్నారు.

ముగ్గురు నిందితుల అరెస్టు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండెక్టర్ దాడి కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు ఇటీవల మదనపల్లె-మొటుకు ఆర్టీసీ బస్సులో డ్రైవర్, కండెక్టర్ల మురగయ్య, శ్రీరాములుపై దాడి చేసి నలుగురు యువకులు గాయపర్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో బుధవారం వేంపల్లె క్రాస్ వద్ద ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. ఒకడు పరారీలో ఉన్నాడు. మదనపల్లె వాసి భానుప్రకాష్, భరత్‌కుమార్, కదిరి ఆర్‌ఎస్ గేట్‌కు చెందిన రాజేష్ నాయక్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు అరెస్టు చేశారు. వేంపల్లెకు చెందిన శ్రీనివాస్ చైతన్ పరారీలో ఉన్నట్లు సీఐ చెప్పారు.

కలికిరిలో వర్షం స్వల్పమే

కలికిరి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలు కలికిరిలో పరిమితంగానే నమోదయ్యాయి. మంగళవారం ఉదయానికి 11 మి.మీ, బుధవారం ఉదయానికి 37 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ పుష్ప తెలిపారు. ఈదురుగాలులు, విడతలు విడతలుగా చిరుజల్లులు తప్ప పెద్దగా వర్షం కురవలేదు. జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయడం, తాజాగా హెచ్చరికలు జారీ అయ్యాయి.

చెరువు గండి పూడ్చిన రెవెన్యూ సిబ్బంది



గండి పూడ్చిన తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది

మదనపల్లె అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మదనపల్లె మండలం, చీకలబైలు పంచాయతీ కదిరమ్మ చెరువు కట్టకు గండి పడింది. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి గండిని పూడ్పించారు. కదిరమ్మ చెరువు కట్టను పరిశీలించారు. ఎలాంటి ప్రమాదం లేదని, ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కడైనా వర్షాలకు ప్రమాదాలు జరుగుతాయని గమనిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ తెలిపారు.

శివాలయంలో విశేషపూజలు

పెద్దతిప్పసముద్రం అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కార్తీకమాసం ప్రారంభమై విశేషపూజలు నిర్వహించారు. ఉదయం శివలింగానికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ఆలయంలో లక్ష్మీ హోమం, స్వాతి నక్షత్రం సందర్భంగా సాయంత్రం లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించి, వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ కల్యాణోత్సవం చేశారు. లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదానం నిర్వహించారు.

మదనపల్లెలో కార్తీక శోభ

మదనపల్లె అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): బుధవారం మొదలు కార్తీక మాసం ప్రారంభమైంది. దీంతో పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని శైవక్షేత్రాల్లో కార్తీక శోభ మొదలైంది. సీటీఎం రోడ్డులోని మంజునాథ స్వామి, దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి, నీరుగట్టువారిపల్లెలోని నీలకంఠేశ్వరస్వామి, చిప్పిలి గ్రామంలో మడికయ్యల శివాలయంలోని యోగ భోగేశ్వరస్వామి, సీటీఎం గ్రామంలోని కాశీవిశ్వేరాలయం, దేవతానగర్‌లోని రాజారాజేశ్వరీదేవి, బసినికొండ శివాలయం, కనకదాస్‌నగర్‌లోని సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపోత్సవం నిర్వహించారు.

పేద రోగులకు వరం డయాలసిస్ సెంటర్

ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి

పీలేరు రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పీలేరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు పేద రోగుల పాలిట వరమని పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీలేరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం అభినందనీయమన్నారు. పీలేరు ఎమ్మెల్యే కృషి ఫలితమే ప్రాజెక్ట్ మంజూరైందన్నారు. మంత్రి నారా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారన్నారు. తిరుపతి, చిత్తూరు, మదనపల్లె, రాయచోటికి సమాన దూరంలో ఉన్న పీలేరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో చుట్టుపక్కల పది మండలాల డయాలసిస్ పేషెంట్లకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. వైద్య పరంగా ఇది పీలేరుకు ముందడుగు లాంటిదన్నారు.

మరుగుదొడ్లు నిర్మించండి

మదనపల్లె, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయమైన రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్, ట్రెజరీ, కోర్టు ఆవరణలో మరుగుదొడ్లు నిర్మించాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు వినతి పత్రం అందజేశారు.

మహిళ ఆచూకీ కోసం గాలింపు

సిద్దవటం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దేగనవారిపల్లె వాసి అమ్మన్ని(59) బుధవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పెన్నా పరివాహక ప్రాంతాల్లో కడప ఫైర్, రెస్క్యూ టీమ్ సాయంతో విస్తృతంగా గాలిస్తున్నామని సీఐ బాబు తెలిపారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

సిద్దవటం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తహసీల్దారు కార్యాలయంలో ఈనెల 24వ తేదీ వరకు కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు తిరుమలబాబు తెలిపారు. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా ముందస్తు చర్యగా దీనిని ఏర్పాటు చేశారన్నారు.

నామమాత్రంగా మండల సమావేశం

● డుమ్మా కొట్టిన అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వండి: ఎంపీపీ

● సమస్యలపై ప్రశ్నించిన సభ్యులు



అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ చంద్రశేఖర్

పెద్దతిప్పసముద్రం అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సమావేశం నామ మాత్రంగా జరిగింది. ఉదయం 11 గంటలకు ఎంపీపీ మహమూద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సమావేశంలో ఆయా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాల వివరాల కోసం మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, సర్పంచులతో చర్చిస్తారు. గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలపై చర్చించేందుకు కూడా పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టడంపై ఎంపీపీ అసహనం వ్యక్తం చేస్తూ గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్‌ను ఆదేశించారు. ఎంపీటీసీ సభ్యుడు కార్యం చంద్రశేఖర్ మాట్లాడుతూ పీటీఎంలో వైసీపీ ప్రభుత్వం రూ.28 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్ర భవనం నిరుపయోగంగా ఉందని మండల వ్యవసాయాధికారిని ప్రశ్నించారు. మండల కేంద్రంలో రైతులకు అందుబాటులో రైతుసేవా కేంద్రం ఏర్పాటు చేయకపోతే తాము పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. బూర్లపల్లెలో అభివృద్ధి పనులను చేపట్టినా బిల్లులు మంజూరు చేయలేదని బూర్లపల్లె సర్పంచ్ సుబ్బిరెడ్డి ఎంపీడీఓను ప్రశ్నించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ బూర్లపల్లెలో జరిగిన పనుల్లో అవినీతి అక్రమాలు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణ జరుగుతోందని, విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బిల్లులు మంజూరు చేస్తామని సమాధానమిచ్చారు. తహసీల్దార్ శ్రీరాములు నాయక్, జడ్పీటీసీ శివన్న, ఎంపీపీ-2 పట్టిరిక శోభ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వర్షం కురిస్తే నరకమే...!

ఎంపీడీఓకు కోనేటివారిపల్లె గ్రామస్తుల వినతి



ఎంపీడీఓకు విన్నవిస్తున్న కోనేటివారిపల్లె గ్రామస్తులు

ములకలచెరువు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వర్షం కురిస్తేచాలు రోడ్డంతా రొచ్చుగా మారి 108 వాహనం కూడా వచ్చేందుకు వీలు లేకుండా పోతోంది. రోడ్డు బాగు చేయాలని కోనేటివారిపల్లె గ్రామస్తులు బుధవారం ఎంపీడీఓ హరి నారాయణకు విన్నవించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం చేరుకుని రోడ్డు దుస్థితిపై వివరించారు. వారు మాట్లాడుతూ పంచాయతీ కేంద్రంగా ఉన్న కోనేటివారిపల్లె మట్టి రోడ్డు గుంతలమయమై దుస్థితికి చేరుకుందన్నారు. వర్షం వస్తే చాలు రొచ్చుగా మారి రాకపోకలు సాగించడానికి కూడా వీలు లేకుండా పోతోందన్నారు. దీంతో కాలినడకన సాగించడానికి కూడా వీలుండదన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే 108 కూడా గ్రామానికి రావడానికి ఆస్కారం లేకుండా పోయిందన్నారు. తమ రోడ్డు బాగు చేయాలని ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. కార్య క్రమంలో గ్రామస్తులు కోనేటి రవీంద్ర, కట్టా చలపతి, ఉమాశంకర్, సురేంద్ర, లక్ష్మీపతి, మహేష్, రాము, అనీల్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిరుజల్లుల్లోనూ చిన్నారులు...



సరదాగా క్రికెట్ ఆడుతున్న చిన్నారులు

వాల్మీకిపురం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా బుధవారం పాఠశాలలకు సెలవు ఇవ్వడంతో చిన్నారులు చిరుజల్లులు కురుస్తుండగా ఆడుతూ తడిసి ముచ్చట తీర్చుకున్నారు. చింతపర్తి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణలో చిన్నారులంతా ఓ వైపు చినుకులు రాలుతున్నా క్రికెట్ ఆడుకుతూ సందడిగా కనిపించారు. జాతీయ రహదారిపై గ్రామీణులు వర్షపు నీటిలో తమ వాహనాలను కడుగుతూ కనిపించారు.